నేడు సంకట హర చతుర్థి

నస్పూర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : నస్పూర్ పట్టణం హౌసింగ్ బోర్డు కాలనీలోని శ్రీ లక్ష్మి గణపతి దేవాలయంలో సంకట హర చతుర్థిని పురస్కరించుకుని శని వారం స్వామి వారికి మహా భస్మాభిషేకం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ రఘుపతి రావు, ప్రధానార్చకులు వంశీ కృష్ణ శర్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం ప్రత్యేక పూజలు, సాయంత్రం స్వామి వారికి విశేష మహా భస్మాభిషేకం ఉంటుందన్నారు

జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక

చెన్నూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఆస్నాద గ్రామంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న గుడిమల్ల శ్రీవర్షిణి అండర్ 17 జాతీయ సాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం అనురాధ శుక్రవారం తెలిపారు. మహబూబ్‌నగర్‌లో ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చి జాతీయ పోటీలకు ఎంపికైందన్నారు. ఉత్తరప్రదేశ్‌లోని రాయ్ బరేలిలో జరిగిఏ జాతీయ పోటీల్లో పాల్గొంటుందన్నారు. పీడీ సత్యనారాయణ, ఉపాధ్యాయులు అభినందించారు.

వరి పంట ధ్వంసం

చెన్నూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : గంగారం గ్రామంలోని దుర్గం నగేష్ అనే రైతుకు చెందిన వరి పంటను అడవి పందులు నాశనం చేశాయి. సుమారు 3 ఎకరాల్లో చేతికి వచ్చిన వరి పంటను అడవి పందులు ధ్వంసం చేశాయని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని రైతు కోరాడు.

కరిగిపోతున్న జాలా గుట్ట



బండ రాళ్లను ట్రాక్టర్లో నింపుతున్న కూలీలు

- అనుమతుల్లేకున్నా క్వారీ నిర్వహణ
- పెద్ద ఎత్తున తరలిపోతున్న బండ, మొరం
- జిల్లా కేంద్రంలో జోరుగా సాగుతున్న అక్రమ దందా
- చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్న మైనింగ్ శాఖ

మంచిర్యాల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): అక్రమ క్వారీ నిర్వాహకుల ధన దాహానికి ఓ కొండ కరిగిపోతోంది. ఎలాంటి అనుమతులు లేకపోయినా అక్రమంగా యంత్రాల సహాయంతో క్వారీ నిర్వహిస్తూ గుట్టను తవ్వుతున్నారు. నిత్యం దాదాపు 40 నుంచి 50 ట్రాక్టర్ల ద్వారా బండరాయిని తరలించుకుపోతున్నా అడిగే వారు కరువయ్యారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని అండాళమ్మ కాలనీ సమీపంలోని, మున్సిపల్ డంప్ యార్డు వద్ద జాలా గుట్టలో కొంత కాలంగా అక్రమ క్వారీ కొనసాగుతోంది. పట్ట పగలే గుట్టను తొలుస్తూ బండ రాయిని తరలించుకుపోతున్నా సంబంధిత అధికారుల దృష్టికి రాక పోవడం గమనార్హం. గుట్టలు, కొండల్లో బండరాళ్ళ, మొరం తవ్వకాలపై ఎప్పటికప్పుడు నిఘా వేసి సంబంధిత అధికారులను అప్రమత్తం చేయాల్సి న నిఘా విభాగం నిర్వీర్యం కావడంతోనే అక్రమ తవ్వకాలు యథేశ్చగా సాగుతున్నట్లు తెలుస్తోంది.

యథేచ్ఛగా తవ్వకాలు...

జాలా గుట్టలో బండ, మొరం తవ్వకాలకు సంబంధించి గనులు, భూగర్భ శాఖ నుంచి ఎలాంటి అనుమతులు లేవు. రాత్రి వేళ జేసీబీ సహాయంతో గుట్టను తొలుస్తున్న అక్రమార్కులు, పగటిపూట తవ్విన బండ, మొరాన్ని ట్రాక్టర్లలో నింపి తరలిస్తున్నారు. బండ రాళ్లను నేరుగా తరలిస్తుండగా, మొరాన్ని గుట్ట సమీపంలో నిల్వ చేసి, అదును చూసుకొని ఇతర ప్రాంతాలకు సరఫరా చేస్తున్నారు. అక్రమ తవ్వకాల కారణంగా గుట్ట దాదాపు నేల మట్టం కాగా, నాలుగైదు మీటర్ల లో తుగల పెద్ద గుంతలతో ఆ ప్రాంతమంతా ప్రమాదకరంగా తయారైంది. వర్షాకాలంలో ఆ గుంతల్లో నీరు నిలిస్తే..అటవీ ప్రాంతంలో గడ్డి కోసం వెళ్లే పశువులు, ప్రజలకు ప్రమాదం జరిగే అవకాశాలు ఉన్నాయి. జాలా గుట్టలో పై భాగంలో రిజర్వు ఫారెస్టు ఉండగా, అటవీశాఖ హద్దులు ఏర్పాటు చేసింది. ఆ హద్దులను ఆనుకొని తవ్వకాలు సాగిస్తున్నారు.

పెద్ద మొత్తంలో తరలింపు ...

జాలా గుట్టలో అక్రమ తవ్వకాల కారణంగా పెద్ద మొత్తంలో బండరాయి, మొరం తరలిపోతుండగా, నిర్వాహకులకు భారీగా సంపాదన ఉన్నట్లు తెలుస్తోంది. అక్రమ క్వారీలు కనుక ఎలాంటి ట్యాక్స్‌లు ప్రభుత్వానికి చెల్లించాల్సిన అవసరం నిర్వాహకులకు లేదు. నిత్యం 50 ట్రాక్టర్ల వరకు బండ తరలిస్తుండగా, ఒక్కో ట్రిప్పునకు రూ. 1500 వరకు వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. అదే మొరం ట్రిప్పు ఒక్కంటికి రూ. 2000 వరకు ధర పలుకుతోంది. అలా వెలికి తీసిన బండ రాయి, మొరాన్ని..

మిగతా 7వ పేజీలో..

గూడెంలో భక్తుల రద్దీ



గూడెంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాల్లో పాల్గొన్న భక్తులు

దండేపల్లి నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కార్తీక శుద్ధ చవితి సందర్భంగా దండేపల్లి మండలం గూడెం సత్యనారాయణ స్వామి ఆలయంలో శుక్రవారం వందలాది మంది భక్తులతో తరలివచ్చి కార్తీక పూజలను నిర్వహించారు. ఉదయం గోదావరి నదిలో భక్తులు కార్తీక పుణ్యస్నానాలు ఆచరించి, కుటుంబసమేతంగా భక్తులు గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేసి నదిలో కార్తీక దీపాలను వదిలారు. అనంతరం సత్యదేవుడిని దర్శించుకొని ప్రత్యేక పూజలతో కార్తీక దీపాలను వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. వందలాది మంది భక్తులు కుటుంబ సమేతంగా స్వామి వ్రతాన్ని నోముకొని పూజలు చేశారు. ప్రధానలయం ధ్వస స్తంబం, రావి చెట్టు వద్ద భక్తులు కార్తీక దీపాలు వెలింగించి పూజలు చేశారు. దీంతో ఆలయం వద్ద భక్తులతో కార్తీక శోభ సంతరించుకుంది.

కలప తరలింపు కేసులో నిందితుడి రిమాండ్



నిందితుడిని రిమాండ్‌కు తరలిస్తున్న అటవీ శాఖ అధికారులు, సిబ్బంది

దండేపల్లి నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): దండేపల్లి మండలం పాత మామిడిపల్లి గ్రామానికి చెందిన షంషుద్దీన్ అనే వ్యక్తి అక్రమంగా బైక్‌పై కలపను తరలిస్తూ పట్టుబడటంతో అతడిని గురువారం రాత్రి అరెస్టు చేసి రిమాండ్ చేసినట్లు తాళ్లపేట ఎఫ్ఆర్‌వో సుష్మరావు తెలిపారు. మండలంలోని అటవీప్రాంతం గుండా అక్రమంగా బైక్‌పై తరలిస్తూ అటవీ శాఖ అధికారులు, సిబ్బంది పట్టుబడ్డారు. దీంతో అతడిపై విచారణ చేపట్టి అటవీ ప్రాంతం గుండా చెట్లు నరికి తరలించడం నేరమన్నారు.

మంత్రిని కలిసిన నాయకులు



మంత్రితో మందమర్రి కాంగ్రెస్ నాయకులు

మందమర్రిటౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన, గనుల శాఖ మంత్రి వివేక్‌వెంకటస్వామిని శుక్రవారం మందమర్రి కాంగ్రెస్ నాయకులు హైద్రాబాద్‌లోని షేక్‌పేటలో కలిశారు. ఈ సందర్భంగా మంత్రితో కలిసి జూబ్లీహిల్స్ అభ్యర్థి నవీన్ యాదవ్‌ను గెలిపించాలని ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు, కాంగ్రెస్ నాయకులు బండి సదానందం యాదవ్, ఆవునూరి పోశం తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ డీఏలను వెంటనే విడుదల చేయాలి



మాట్లాడుతున్న తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం నాయకులు

చెన్నూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు పేర్కొన్నారు. శుక్రవారం చెన్నూరులోని బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దాదాపు మూడేళ్ల డీఏలను ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టడంతో ఉద్యోగులు మానసిక వేదనకు గురవుతున్నారన్నారు. నెలకు రూ. 700 కోట్ల రూపాయల పెండింగ్ బిల్లులను క్లియర్ చేస్తామని చెప్పడమే కానీ విడుదల చేయడం లేదన్నారు. పీఆర్సీ గురించి ఊసే లేదని, ఒక వైపు ఉద్యోగులు దాచుకున్న డబ్బులతో ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. రిటైర్డు ఉద్యోగులకు 18 నెలల నుంచి బెనిఫిట్స్ అందకపోవడంతో తీవ్ర మనోవేదనతో చనిపోతున్నారన్నారు. వెంటనే ప్రభుత్వం సమస్యలను పరిష్కరించాలన్నారు.

జాతీయ స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక



సత్యనారాయణ,రాజు(ఫైల్)

కాసిపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : జాతీయ స్థాయి క్రీడా పోటీలకు బెల్లంపల్లి అటవీ రేంజ్ పరిధి నుంచి దర్మారావుపేట సెక్షన్ ఆఫీసర్ సత్యనారాయణ, ఆదిలోపేట బీట్ ఆఫీసర్ రాజులు ఎంపికైనట్లు బెల్లంపల్లి ఎఫ్ఆర్‌వో పూర్ణచందర్ తెలిపారు. 28వ జాతీయ అటవీ క్రీడా పోటీల్లో భాగంగా గత నెల 17,18తేదీల్లో హైద్రాబాద్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ఇద్దరు మెరుగైన ప్ర తిభ కనబర్చారన్నారు. జావెలిన్ త్రో, షాట్‌పుట్, డిస్కస్‌త్రోలో ప్రతిభ కనబర్చిన ఇద్దరు తెలంగాణ రాష్ట్రం తరుపున జాతీయ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ నెల 12 నుంచి 16 వరకు డెహ్రాడూన్‌లో జరిగే జాతీయపోటీల్లో పాల్గొన నున్నట్లు తెలిపారు. వీరిని పలువురు అభినందించారు.

ఆలయ ధ్వజ స్తంభం ఏర్పాటు



ధ్వజస్తంభం వద్ద పూజల్లో పాల్గొన్న కమిటీ సభ్యులు

లక్షెట్టిపేట, నవంబరు7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీకన్యకా పరమేశ్వరి ఆలయంలో శుక్రవారం ధ్వజ స్తంభంతో పాటు నవగ్రహాలను వేద పండితుల సమక్షంలో కమిటీ సభ్యులు ఏర్పాటు చేసారు. ధ్వజ స్థంభం ఏర్పాటు సందర్భంగా ఆలయంలో రెండు రోజులుగా వేద బ్రాహ్మణుల సమక్షంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధ్వజస్తంభం ఏర్పాటుకు సహకరించిన దాతలకు ఆలయ కమిటీ సభ్యుల సమక్షంలో ఘనంగా సన్మానించగా పురోహితుల ఆశీర్వచన అనంతరం తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈకార్యక్రమంలో కమిటీ సభ్యులు కొత్త వెంకటేశ్వర్లు, మైలారపు సుధాకర్, తాటికొండ శ్రీనివాస్, పాలకుర్తి లచ్చన్నతోపాటు మున్సిపల్ మాజీ చైర్మన్ నలుమాసు కాంతయ్య, మాజీ కౌన్సిలర్ చింత సువర్ణతో పాటు అధిక సంఖ్యలో భక్తులు, మహిళలు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌పై సమావేశం

చెన్నూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 15న నిర్వహించే లోక్ అదాలత్‌పై శుక్రవారం చెన్నూరు కోర్టులో జడ్జి రవి పోలీసులు, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ లోక్ అదాలత్ విజయవంతం కోసం కృషి చేయాలన్నారు. పెద్ద ఎత్తున కేసులు పరిష్కారమయ్యేలా చూడాలన్నారు. లోక్ అదాలత్‌పై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ దేవేందర్‌రావు, పోలీసులు పాల్గొన్నారు.

ఎరుకల కులస్తుల సమస్యలను పరిష్కరించాలి

కలెక్టరేట్ ఎదుట ఒక్క రోజు దీక్ష



దీక్షలో కూర్చున్న ఎరుకల ప్రజా సమితి నాయకులు

నస్పూర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఎరుకల కులస్తుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం తెలంగాణ ఎరుకల ప్రజా సమితి ఆధ్వర్యంలో నస్పూర్‌లోని కలెక్ట రేట్ ఎదుట ఒక రోజు దీక్ష చేపట్టారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఆదనపు కలెక్టర్ చంద్రయ్యకు వినతి పత్రం అందించారు. అనంతరం ఎరుకల ప్రజా సమితి రాష్ట్ర అధ్యక్షుడు కెమసారం తిరుపతి మాట్లాడుతూ సమాజంలో ఎరుకల కులస్తులు అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నరని, వారిని ప్రభుత్వం ఆదుకోవా లన్నారు. పందుల పెంపకం కోసం ప్రతి కుటుంబానికి ఐదెకరాల భూమిని ఇవ్వాలన్నారు. కార్పొరేషన్, మున్సిపాలిటీల్లో అవుట్ సోర్సింగ్ ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. శాస్త్రీయ పద్ధతిలో పందుల పెంపకం కోసం ప్రభుత్వం శిక్షణ కార్యక్రమం నిర్వహించాలన్నారు. ప్రత్యేక ఏకలవ్య కార్పొరేషన్ ఏర్పాటు చేసి 500 కోట్ల బడ్జెట్‌ను కేటాయించాలన్నారు. మున్సిపాలిటీల్లో పంది మాంసం విక్రయానికి దుకాణాలు ఏర్పాటు చేయించాలన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ ఉన్న యువతకు నూరు శాతం సబ్సిడితో ఆటోలను ఇప్పించాలన్నారు. వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న ఎస్‌టీ బ్యాక్ లాగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

ఈ దీక్ష కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రెవెల్లి ఓదెలు, జిల్లా అధ్యక్షుడు ఉంద్రాల ఎల్లయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి జగన్నాథుల మహేష్, జిల్లా వర్కింగ్ ప్రసిడెంట్ ఉంద్రాల రవి, ఉపాధ్యక్షుడు అశోక్, నాయకులు సంతోష్, సభాష్, రవి కుమార్, మహిళ సమితి రాష్ట్ర అధ్యక్షురాలు పుష్ప, మహిళా నాయకులు విజయ, రజిత, రాజవ్వ, సత్తవ్వ, కోమల పాల్గొన్నారు.

మంచిర్యాల డీటీవోగా గోపీకృష్ణ నియామకం



హాజీపూర్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి) : మంచిర్యాల జిల్లా రవాణా శాఖా అధికారి (డీటీవో)గా వెల్ది గోపీకృష్ణ నియామకం అయ్యారు. ఈ మేరకు రవాణా శాఖా కమిషనర్ ఇలం బర్తి ఉత్తర్వులు మేరకు శుక్రవారం ఆయన ఇన్‌చార్జి డీటీవో సంతోష్ కుమార్ నుంచి బాధ్యతలు స్వీకరించారు. గ్రూపు-1లో ఉద్యోగం సాధించిన గోపీకృష్ణకు మంచిర్యాల డీటీవోగా మొదటి పోస్టింగ్. కాగా ఇప్పటికే టీఎస్పీఎస్సీలో అసిస్టెంట్ మోటార్ వెహికిల్ ఇన్స్పెక్టర్ (ఏఎంవీఐ)గా ఉద్యోగం సాధించిన గోపీకృష్ణ ఖమ్మం ఆర్టీవో కార్యాలయంలో ఏఎంవీఐగా పని చేస్తూనే గ్రూపు-1లో పరీక్షలు రాసి మరీ ఆర్టీవోగా ఉద్యోగం సాధించారు. హన్మకొండకు చెందిన గోపీకృష్ణ తల్లిదండ్రులు విజయలక్ష్మి-నాగేశ్వర్‌రావులు ఉండగా గ్రూపు -1లో పరీక్షల సమయంలో తండ్రి నాగేశ్వర్‌రావు దివంగతులయ్యారు. గోపీకృష్ణ సోదరుడు గణేశ్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. బాధ్యతలు స్వీకరించిన గోపీకృష్ణకు ఎంవీఐలు సంతోష్‌కుమార్, చంద్రశేఖర్‌రెడ్డి, ఏఎంవీఐలు ఖాసీం, సూర్యతేజ, సాయిలెనిన్, సిబ్బంది స్వాగతం పలికి అభినందించారు.

ఘనంగా జంపాల వర్ధంతి

లక్షెట్టిపేట, నవంబరు7 (ఆంధ్రజ్యోతి): లక్షెట్టిపేట పట్టణ కేంద్రంలో పీడీఎస్‌యూ నిర్మాత జంపాల చంద్రశేఖర్ వర్ధంతిని శుక్రవారం సభ్యులు ఘనంగా నిర్వహిం చారు. ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా పీడీ ఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ మాట్లాడుతూ విద్యార్థి వ్యతిరేక విధానాలపై పీడీ ఎస్‌యూ ఉద్యమిస్తుందని, విద్యారంగ సమస్యలపై ముందుండి పోరాటం చేస్తుందన్నారు. జంపాల విద్యార్థుల సమస్యల పరిష్కారం చేసిన ఉద్యమాలను గుర్తు చేసారు. ఈకార్యక్ర మంలో పీడీఎస్‌యు నాయకులు అంజి, సంజయ్‌కుమార్ పాల్గొన్నారు.

గంజాయి మొక్క పెంచుతున్న మహిళపై కేసు నమోదు

నస్పూర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : నస్పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆర్‌కే-5 కాలనీలో నివాసం ఉంటున్న శంకరమ్మ ఇంటి అవరణలో నిషేధిత గంజాయి మొక్కను పెంచుతున్నందున ఆమెపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఉపేందర్‌రావు తెలిపారు. రెండవ ఎస్సై జితేందర్ సింగ్‌కు శుక్రవారం ఉదయం వచ్చిన సమాచారం మేరకు ఆర్‌కే-5 కాలనీలోని ఆమె ఇంటికి సిబ్బందిలో వెళ్లి చూడగా ఇంటి అవరణలో రెండు మీటర్ల పొడవు ఉన్న గంజాయి మొక్క కనిపించిందన్నారు.

వెంటనే దానిని స్వాధీనం చేసుకుని ఆమెపై కేసు నమోదు చేశామన్నారు. ఎం డీ ఖయ్యూం అలియాస్ సోనూ సహా యంతో అక్రమంగా గంజాయి మొక్కను పెంచుతుందన్నారు. మొక్క విలువ దాదాపు రూ. 10వేలు ఉంటుందన్నారు. శంకరమ్మపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఉపేందర్‌రావు తెలిపారు.

పొంచి ఉన్న పెను ప్రమాదం..

- కోతకు గురైన ఎల్లంపల్లి దిగువ గోదావరి తీర ప్రాంతం
- ప్రమాదపుటంచున 220కేవీ టవర్



కూలిపోయే దశలో ఉన్న భారీ విద్యుత్ టవర్

హాజీపూర్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి) : ఈ ఏడాది ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాలకు ఎల్లంపల్లి ప్రాజెక్టు గేట్లు మూడు నెలలుగా తెరిచి నీటిని దిగువ గోదావరికి వదులుతున్నారు. ప్రాజెక్టు గేట్లు 62కు గాను సెప్టెంబర్ నెలలో 45 గేట్లను ఒక్క సారిగా ఎత్తి 8 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువ గోదావరికి వదిలారు. దీంతో ప్రాజెక్టుకు కిలో మీటర్ వరకు గోదావరి తీరం తీవ్ర కోతకు గురైంది. తీరం ఒడ్డునే మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాలకు విద్యుత్ సరఫరా చేసే 220, 1320 కేవీ ట్రాన్స్‌కో టవర్లు ఉన్నాయి. ప్రస్తుతం 220 కేవీ టవర్ కు కేవలం 10 మీటర్ల దూరం వరకు కోతకు గురై పడిపోయే ప్రమాదం పొంచివుంది.

20 ఏళ్ల క్రితం అంధకారంలో రెండు జిల్లాలు..

ఎల్లంపల్లి ప్రాజెక్ట్ నిర్మాణ సమయంలో 2005లో గోదావరికి అడ్డుకట్ట వేసి పనులు కొనసాగిస్తున్న సమయంలో ఒక్క సరిగా వచ్చిన వరద తాకిడికి గోదావరి నదిలో ఉన్న రెండు టవర్లు కూలిపోయాయి. ఆ సమయంలో మంచిర్యాల, కొమురంభీం జిల్లాలకు వారం రోజులు పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయి రెండు జిల్లాలు అంధకారంలోకి వెళ్లాయి. ఇప్పుడు కూడా కూలి పోయే దశలో ఉన్న టవర్లను ట్రాన్స్‌కో అధికారులు పట్టించుకోక పోతే రాబోవు రోజుల్లో మళ్లీ వరద తాకిడికి టవర్లు కూలిపోయే ప్రమాదం ఉంది. రోజు చేపల వేటకు వెళ్లే జాలర్లు కూడా ఈ టవర్లు కూలిపోయే ప్రమాదం ఉందంటూ భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు కోతకు గురై కూలిపోయే దశలో ఉన్న భారీ టవర్లను వేరే సురక్షిత ప్రాంతంలో ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. వాటి పక్కన ఉన్న వ్యవసాయ విద్యుత్ సరఫరా చేసే 11 కేవీ లైన్ స్థంబాలైతే రపో మాపో గోదావరిలో పడే పరిస్థితిలో వున్నాయి. ట్రాన్స్‌కో, హాజీపూర్ విద్యుత్ శాఖ అధికారులు ఆ కోతకు గురైన ప్రాంతాన్ని పరిశీలించి ముందుజాగ్రత్త చర్యలు చేపట్టాలని సమీప రైతులు కోరుతున్నారు.

జనజాగృతి గీతం-వందేమాతరం

సీపీ అంబర్ కిషోర్ ఝూ

మంచిర్యాల క్రైం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి) : భారత జాతి బానిసత్వ విముక్తి జన జాగృతి గీతం వందేమాతరం అని రామగుండం పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ అన్నారు. బంకించంద్ర చటర్జి రచించిన వందేభారత గీతం 150 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు శుక్రవారం వందేమాతర గీతాలాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత్ భారీ సామాజిక, సాంస్కృతిక రాజకీయ మార్పులకు లోనవుతున్న కాలంలో జాతీయ గుర్తింపు భావన, వలస పాలనపై ప్రతిఘటన పెరుగుతున్న ఆ కాలంలో వందే మాతరం, మాతృభూమని, బలం, దైవజ్ఞానకి ప్రతీకగా మార్చిందన్నారు. భారతీయ సమైఖ్యత, ఆత్మ గౌరవాన్ని పెంపొం దించిందన్నారు. జాతీయ గేయాన్ని గౌరవించేందుకు దేశ భక్తి కృతజ్ఞతకు సమిష్టి ప్రతీకగా ఈ కార్యక్రమాల్లో దేశ ప్రజలందరూ పెద్ద సంఖ్యలో పాల్గొనాలని అన్నారు. ఈ కార్య క్రమంలో అడిషన్ డీసీపీ అడ్మిన్ శ్రీనివాస్, ఏఆర్ ఏసీపీ ప్రతాప్, ఆర్ఐలు వామన మూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.



వందేమాతర గీతం ఆలపిస్తున్న రామగుండం సీపీ, పోలీసు అధికారులు

రెవెన్యూ కార్యాలయంలో...

మంచిర్యాల రెవెన్యూ డివిజన్ అధికారి కార్యాలయంలో వందేమాతర గీతాన్ని ఆలపించారు. 150 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆర్‌డీవో శ్రీనివాస్‌రావు, డీఏవో రమేష్, డీటీ శ్రీహరి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మంచిర్యాల కలెక్టరేట్ : యావత్ భారతాన్ని ఏకం చేసి భారతీయులందరిలో స్వాతంత్ర్య కాంక్షను రగిలించిన గీతం వందే మాతరం అని జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్య అన్నారు. వందేమాతర గేయం రచించి 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా శుక్రవారం నస్పూర్‌లోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయం భవన సముదాయం ఆవరణలో సామూహిక గీతాలాపన కార్యక్రమం నిర్వహించారు.



గీతాలాపన చేస్తున్న అదనపు కలెక్టర్ చంద్రయ్య , అధికారులు

ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ బంకించంద్ర చటర్జీ రచించిన వందే మాతర గీతం అందరిలో స్ఫూర్తిని నింపిందన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్‌ఏవో రాజేశ్వర్, సిబ్బంది, అధికా రులు పాల్గొన్నారు.

జీపు, ద్విచక్ర వాహనం ఢీ..ఇద్దరికి గాయాలు


ప్రమాదంలో గాయపడిన నారాయణ, కృష్ణసర్కార్

భీమిని, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): భీమిని మండలం రాంపూర్ రైతు వేదిక సమీపంలో రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. జీప్, టూ వీలర్ ఢీ కొనడం తో బైక్ మీద ఉన్న ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం వెంకటాపూర్ నుంచి వస్తున్న జీప్ తాండూర్ మండలం గోపాల్‌నగర్ గ్రామానికి చెందిన గజ్జల నారాయణ, కుమరం భీం ఆసిఫా బాద్ జిల్లా కాగజ్‌నగర్ మండలం ఈజ్‌గాం గ్రామానికి చెందిన కృష్ణసర్కార్ ఇద్దరు కలిసి బైక్ పై భీమిని మండలం మల్లీడి గ్రామం వైపు వస్తున్న క్రమంలో రాం పూర్ రైతు వేదిక సమీపంలో బైక్, జీపు వాహనం ఎదురెదురుగా ఢీకొనడంతో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు 108కు ఫోన్ చేయడంతో గాయపడిన ఇద్దరి ని బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం మంచిర్యాలకు తరలించారు. కృష్ణ సర్కార్‌కు మొకాలు చిప్పకు తీవ్రంగా గాయాలయ్యాయి, గజ్జల నారాయణకు మోచేతి భాగంలో తీవ్రంగా గాయపడ్డారని 108 ఈఎంటీ సారయ్య తెలిపారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని జీపు, బైకును పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

మద్యం మత్తులో వృద్ధుడి ఆత్మహత్య

కాసిపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముత్యంపల్లికి చెందిన సింగరేణి రిటైర్డు కార్మికుడు మంద భీమయ్య (70) గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు కాసిపేట ఎస్‌ఐ ఆంజనేయులు తెలిపారు. ఎస్‌ఐ, కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం భీమయ్య భార్య పోసక్క 13 ఏళ్ల క్రితం మృతిచెందింది. అప్పటి నుంచి మద్యానికి బానిసయ్యాడు. కొంత కాలంగా మానసిక ఒత్తిడికి గురవుతున్నాడు. గత మంగళవారం సాయంత్రం ఇంట్లో ఎవరు లేని సమయంలో గడ్డి మందు తాగాడు. గమనించిన కుటుంబీకులు మండల కేంద్రంలోని కాసిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుప త్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతిచెందినట్లు తెలిపారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

గంజాయి మొక్కలు స్వాధీనం


గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

కెరమెరి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కెరమెరి మండలం కోట గ్రామ పరిధిలో పరందోళి గ్రామ పంచాయతీకి చెందిన గాయకవాడ్ శివాజి తన పత్తి చేనులో 28 గంజాయి మొక్కలను సాగు చేస్తుండగా శుక్రవారం పోలీసులు స్వాధీనం చేసుకు న్నారు. ఈ గంజాయి మొక్కల విలువ సుమారు రెండు లక్షల 80 వేల రూపాయ లుగా ఉంటుందని ఎస్సై మధుకర్ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ గంజాయి సాగు లేదా వినియోగం చట్ట విరుద్ధమని అన్నారు. ఇలాంటి చర్యలు ఎవరైనా గమనించి వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

మద్యం మత్తులో డ్రైవర్.. చెట్టును ఢీకొన్న టిప్పర్

బెజ్జూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): బెజ్జూరు మండలంలోని రెబ్బెన గ్రామంలో గురువారం రాత్రి టిప్పర్ డ్రైవర్ మద్యం మత్తులో నడుపడంతో అదుపుతప్పి ఓ చెట్టును ఢీ కొట్టింది. . టిప్పర్ ముందు భాగం నుజ్జునుజ్జు అయింది. కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన ట్రాన్స్‌పోర్టు టిప్పర్ కంకర లోడ్ వేసుకొని బెజ్జూరుకు వచ్చి అన్‌లోడ్ చేసి వెళ్తున్న క్రమంలో రెబ్బెన గ్రామంలో రోడ్డుపై ఉన్న బైక్‌ను ఢీ కొట్టి దానిపై నుంచి టిప్పర్ ఎక్కించి పక్కనే ఉన్న చెట్టును ఢీ కొట్టింది. ఈ ఘనటలో లాంటి ప్రమాదం జరగలేదు. టిప్పర్ డైరవర్ అబిబ్‌ఖాన్ మద్యం మత్తులో ఉన్నాడని స్థానికులు తెలిపారు. ఏఎస్సై మోహ న్‌నాయక్ డ్రైవర్‌పై డ్రంకెన్‌డ్రైవ్ కేసు నమోదు చేశారు.


కంకాలమ్మ జాతరకు ఏర్పాట్లు

- 13 నుంచి ఆరు రోజుల పాటు వేడుకలు
- ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు



కొలువైన కంకాలమ్మ అమ్మవారు, నిర్మించిన ఆలయం

కౌటాల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): చుట్టూ పచ్చదనం.. మధ్యంలో ఒక ఎత్తైన గుట్ట. వాటి మధ్య శివపార్వతులు కంకాలమ్మ కేతేశ్వరులుగా భక్తులకు దర్శనమిస్తారు. కౌటాల మండల కేంద్రం సమీపంలో ఎత్తైన గుట్టపై ఉన్న కంకలమ్మ దేవాలయం భక్తుల కొంగు బంగారంగా విరాజిల్లుతోంది. కోరినకోరికలు తీర్చే కల్పతరువుగా కంకాలమ్మ కేతేశ్వర్లు పూజలందుకుంటున్నారు. వందల ఏళ్ల నాటి చరిత్రను కలిగిన ఈ ఆలయం గత దశాబ్ద కాలంగా అత్యంత వేగంగా ప్రాచుర్యం పొందుతోంది. అయితే దేశంలో కంకలమ్మ కేతేశ్వరస్వామి ఆలయాలు రెండే ఉండగా స్వయంభూ గా వెలిసిన ఆలయాల్లో కౌటాల కంకాలమ్మ క్షేత్రం మొదటిదిగా కాగా, కర్ణాటక రాష్ట్రంలోని చిత్రదుర్గలో మరో ఆలయం ఉంది. కానీ అది స్వయంభు కాక పోగా నిర్మితం జరిగింది కావడంతో స్వయంభుగా వెలిసిన కౌటాల క్షేత్రం మహాత్యంపైనే భక్తులకు ప్రగాఢ విశ్వాసం. ఏటా కార్తీక మాసంలో కౌటాల కంకాలమ్మ ఆలయ ప్రాంగణంలో మూడు రోజుల పాటు నిర్వహించే జాతర ఉత్సవాలకు తెలంగాణ రాష్ట్రంలోని భక్తులే కాకుండా మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి రావడం ఇందుకు నిదర్శణం. కంకాలమ్మ జాతరకు చేరుకునేందుకు మొదట కౌటాల నుంచి వెళ్లాలి.


అమ్మవారి పురాతన ఆలయం

ఆలయానికి విశేష చరిత్ర..

దశాబ్దాల క్రితం ఈ ఆలయ నిర్మాణాన్ని ఒకే రాత్రి రాక్షసులు నిర్మించినట్లు పూర్వీకులు చెబుతుంటారు. కాగా ఈ ఆలయ నిర్మాణానికి ఉపయోగించిన భారీ ఆకారంలోని రాళ్ల ఈ ప్రాంతంలో ఎక్కడ కనిపించవు. ఈ రాళ్లను కనీసం 20 మంది కలిసి ఎత్తినా ఎత్తలేని పరిస్థితి ఉండగా ఆనాడు ఏ విధంగా ఈ ఆలయాన్ని నిర్మించారని ప్రతి ఒక్కరి ఆలోచించే పరిస్థితులు నెల కొన్నాయి. ఆలయంలోని దేవతా విగ్రహాలను కొందరు దొంగలించుకుపోతుండగా మేదరి కులానికి చెందిన మేదరయ్య అనే వ్యక్తి అడ్డు తగలగా ఆ దొంగలు అతని శిరస్సు ఖండించినట్లు ఆనవాళ్లుగా అక్కడున్న విగ్రహాలను బట్టి తెలుస్తోంది. కాగా దొంగలించుకు పోయిన విగ్రహాలు లభించక పోయినా అమ్మవారి శక్తి ఇక్కడే ఉందని భక్తులు ప్రగాఢ విశ్వాసం. కంకాలమ్మ గిరిపై ఉన్న ఆలయం 2000 సంవత్సరం నుంచి ప్రాచూర్యంలో వచ్చింది. అయితే కంకాలమ్మ కేతేశ్వర స్వామికి మొక్కులు సమర్పించి కోరికలు కోరుకున్నట్లయితే ఇట్టే నెరవేరుతాయని చెబుతారు.

భారీ ఏర్పాట్లు..

కౌటాల మండల కేంద్రంలోని కంకాలమ్మ ఆలయ ప్రాంగణంలో ఈ నెల 13 నుంచి 18 వరకు జాతర మహోత్సవాలు నిర్వహించడానికి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. ఈ నెల 13న క్షేత్రాధిదేవతల ప్రత్యేక పూజలు, ధ్వజోరహణ, కాల సూచిక ఆవిష్కరణ, 14న కుంకు మార్చన, మహా మంగళ హారతి, మంత్ర పుష్ప, 15న కంకలమ్మ మహాయజ్ఞం, కుష్మాండ బలిహారణము, కళాన్యాసం, 16న మహాజాతర ఉత్సవం, 17న అభిషేకం, అర్చన, జాతర మహోత్సవం రెండో రోజు, 18న ముగింపు కార్యక్రమాలను నిర్వహించనున్నారు.

ఏర్పాట్లు చేస్తున్నాం..
సుల్వ కనకయ్య, ఆలయ కమిటీ చైర్మన్



కంకాలమ్మ జాతరకు ఏర్పాట్లు చేస్తున్నాం. స్వయం భూగా వెలిసిన కంకాలమ్మ భక్తుల కొంగు బంగారంగా విరాజిల్లుతోంది. అమ్మవారిని కోరికలు కోరుకున్నట్లయితే తప్పకుండా నెరవే రుతాయని భక్తుల నమ్మకం. దీంతో ఆలయానికి ప్రతి నిత్యం భక్తులు వస్తుంటారు. ప్రత్యేక రోజుల్లో భక్తుల రద్దీ అధికంగా ఉంటుంది. స్థానికులతో పాటు దూర ప్రాంతాల నుంచి కూడా భక్తులు ఇక్కడి వచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.

పది క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

సిర్పూర్(టి), నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): సిర్పూర్(టి) మండలం హుడ్కిలి గ్రామంలో అక్రమంగా నిల్ల ఉంచిన పది క్వింటాళ్ల రాయితీ బియ్యంను శుక్రవారం డీటీ ఎన్‌ఫోర్స్‌మెంట్ రాజకుమార్, శ్రీనివాస్ పట్టుకున్నారు. గ్రామానికి చెందిన కిర్మరే దౌలత్ అనే వ్యక్తి రేకుల షెడ్డులో అక్రమంగా నిలువ చేసిన పీడీఎస్ బియ్యంను పట్టుకుని అతనిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మౌలిక వసతుల కల్పనకు చర్యలు

సిర్పూర్(యు), నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నదని ఎంఈవో కుడ్మేత సుధాకర్ అన్నారు.మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల భవనంలో శుక్రవారం మండలంలోని అన్ని యాజమాన్య పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా యూడైస్‌పై ప్రత్యేకంగా ప్రధానోపాధ్యాయులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పుసం నాందేవ్, డీఆర్పీ తీర్మక్‌రావు, అనక దేవెందర్, మడావి శ్రీనివాష్ పాల్గొన్నారు.

పశువులకు టీకా తప్పనిసరిగా వేయించాలి

జైనూర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): రైతులు పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకా తప్పనిసరిగా వేయించాలని మండల సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు మడావి భీంరావ్ అన్నారు. మండలంలోని దుబ్బగూడలో శుక్రవారం పశువులకు గాలి కుంటు వ్యాధి టీకాలు వేశారు. ఈ సందర్భంగా వెటర్నరీ అసిస్టెంట్ సికిందర్ ఇంటింటికి వెళ్ళి పశువులకు టీకాలు వేసి వ్యాధులపై అవగాహన కల్పించారు. వ్యవసాయంతో పాటు పాడి పశువుల పెంపుపై దృష్టి సారించాలని చెప్పారు. . కార్యక్రమంలో శ్రీకాంత్, మంగీలాల్, ప్రకాష్ పాల్గొన్నారు.

అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరించాలి


మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే, పాల్గొన్న ఆర్డీవో లోకేశ్వర్‌రావు

ఆసిఫాబాద్‌రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): జాతీయ కుటుంబ ప్రయోజన పథకం కింద అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో శుక్రవారం ఆర్డీవో లోకేశ్వర్‌రావుతో కలిసి అన్ని మండలాల తహసీల్దార్‌తో జాతీయ కుటుంబ ప్రయోజన పథకం అమలు, మీ సేవ ధ్రువప త్రాలు, సాదాబైనామా, భూభారతి దరఖాస్తుల పెండింగ్, నూతన మీ సేవా కేంద్రాల ఏర్పాటు, ప్రధాన మంత్రి జన్‌మన్ పథకం కింద పీవీటీజీలకు ఇళ్ల నిర్మాణం అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం జాతీయ కుటుంబ ప్రయోజన పథకం కింద కుటుంబ పెద్ద మరణించిన కుటుంబాలకు రూ.20 వేల ఆర్థిక సహాయం అందిస్తుందన్నారు. అర్హత కలిగిన కుటుంబాల నుంచి తహసీల్దార్‌లు దరఖాస్తులు స్వీకరించి సబ్ కలెక్టర్, ఆర్డీవో కార్యాలయాల్లో సమర్పించాలని తెలిపారు. జిల్లాలో సుమారు మూడు వేల కుటుంబాలు ఆర్థిక సహాయం పొందే అవకాశం ఉందన్నారు.. భూ భారతి రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తులను పెండింగ్‌లో లేకుండా త్వరగా పరిష్కరించాలని సూచించారు. మీసేవా కేంద్రాల ద్వారా వివిధ రకాల ధ్రువపత్రాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు నిబంధనల ప్రకారం నిర్ణిత గడువులోగా జారీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. దరఖాస్తులు పెండింగ్‌లో లేకుండా చూడాలని తెలిపారు. ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. అవసరమైన ప్రాంతాల్లో నూతన మీ సేవా కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు సిఫారసు చేయాలని ఆదేశించారు. ప్రధాన మంత్రి జన్‌మన్ పథకంలో భాగంగా పీవీటీజీలకు నివాస గృహాలు, ఇందిరమ్మ ఇళ్ల పనులలో సంబంధిత అధికారులతో సమన్వ యం చేసుకుంటూ త్వరగా పూర్తి చేసే విధంగా దృష్టి సారించాలని సూచించారు. సమావేశంలో చేయూత పెన్షన్ విభాగం ప్రాజెక్టు మేనేజర్ రామకృష్ణ, తహసీల్దార్లులు తదితరులు పాల్గొన్నారు.

సోలార్ విద్యుత్‌కు నిధులు కేటాయించాలి

ఆసిఫాబాద్‌రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బాబాపూర్‌లో గల మహాత్మ జ్యోతిరావుపూలే బాలికల గురుకుల పాఠశాలలో విద్యుత్ సమస్య తీవ్రంగా ఉందని సోలార్ విద్యుత్ ఏర్పాటుకు నిధులు కేటాయించాలని గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సుకన్య కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావులకు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. విద్యార్థుల స్టడీ సమయంలో రాత్రి వేళల్లో కరెంటు తరుచూ పోవడంతో విద్యార్థులు తీవ్రంగా ఇబ్బందులకు గురవుతున్నారని బాలికలు కావడంతో రాత్రి సమయంలో కరెంటు లేక పోతే భయాందోళన చెందుతున్నారన్నారు. చర్యలు తీసుకోవాలని కోరారు.

టీఎస్‌యూటీఎఫ్ మండల కార్యవర్గం


హరీష్, అధ్యక్షుడు


నాగరాజు, కార్యదర్శి

వాంకిడి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): టీఎస్‌యూటీఎఫ్ మండల కార్య వర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బండే హరీష్, ప్రధాన కార్యదర్శిగా నాగరాజు, ఉపాధ్యక్షులుగా రాజలింగు, శారద, కోశాధికారిగా సాయికుమార్, కార్యదర్శులుగా సాయి నాగేందర్, మహేందర్, దశరథ్, లక్ష్మి, చైతన్య, ప్రశాంత్, మహేందర్, మహిళా కన్వీనర్‌గా శోభ, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా రవికుమార్, ఎఫ్‌డ బ్ల్యూఎఫ్ కన్వీనర్‌గా కేశవరావు, మండల సభ్యులుగా రాజు, శృతిక, వెంకటనాగేష్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు రమేష్, దుర్గయ్య, నవీన్‌కుమార్, రవి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో విఫలం

మందమర్రిటౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో గుర్తింపు సంఘం ఏఐటీయూసీ ప్రాతినిధ్య సంఘం ఐఎన్‌టీయూసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో విఫలమయ్యాయని టీబీజీకేఎస్ మందమర్రి ఏరియా ఉపాధ్యక్షుడు మేడిపల్లి సంపత్, కేంద్ర కమిటీ నాయకులు బడికెల సంపత్, దాసరి శ్రీనివాస్ అన్నారు. బీఆర్ఎస్ కార్యాలయంలో శుక్రవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కార్మికులకు ఉద్యోగుల వ్యతిరేక సర్క్యులర్లకు నిరసనగా పోరాట కార్యక్రమాలను రూపొందించామని చెప్పారు. సింగరేణి వ్యాప్తంగా ఈ పోరాటాలు నిర్వహించబోతున్నామన్నారు. ఉద్యోగులకు సంబంధించి 150 మస్టర్లు చేయాలనే సర్క్యులర్ యాజమాన్యం ప్రవేశపెడితే గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు దీనిపై స్పందించడం లేదన్నారు. విచ్చలవిడిగా ఆంక్షలు పెడుతున్న గుర్తింపు సంఘాలు ఏమి మాట్లాడకపోవడం దారుణమన్నారు. ఈ రెండు సంఘాలు యాజమాన్యానికి తొత్తుగామారాయన్నారు. ఎన్నికల ముందు ఎన్నో హామీలు ఇచ్చినా నెరవేర్చలేదని విమర్శించారు. ఉద్యోగులు ఆయా సంఘాలను నిలదీయాలని సూచించారు. తాము సింగరేణిలో గుర్తింపు సంఘంగా ఉన్నప్పుడు ఉద్యోగులకు స్వర్ణయుగమని ప్రస్తుతం ఉద్యోగులు ఆందోళనకు గురవుతున్నారని అన్నారు. ఈసంఘాల విధానాలను ఎండగట్టడమే ఏకైక లక్ష్యంగా తమ పోరాటాలు ఉంటాయన్నారు. సింగరేణిలో నూతన గనులు ఏర్పాటు చేయాలని, పెర్క్స్‌పై ఇన్‌కంటాక్స్ యాజమాన్యం చెల్లించాలని తదితర డిమాండ్లతో ఆందోళనలు చేయనున్నామని తెలిపారు. సమావేశంలో నాయకులు బెల్లం అశోక్, పాణి తదితరులు పాల్గొన్నారు.

గనులపై వందేమాతరం గీతాలాపన


మందమర్రి కేకే5 గని వద్ద వందేమాతర గీతాలాపన చేస్తున్న అధికారులు

మందమర్రిటౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మందమర్రి ఏరియాలోని ఆయా గనుల, డిపార్టుమెంట్ల వద్ద శుక్రవారం వందేమాతర గీతం 150వ గీతాలవన వేడు కలను ఘనంగా నిర్వహించారు. అధికారులు, ఉద్యోగులు జాతీయ జెండాకు సెల్యూట్ చేస్తూ గీతాలను ఆలపించారు. ఏరియాలోని కేకే5, కాసిపేట వర్కుషాపు, స్టోర్స్, సివిల్‌డిపార్ట్‌మెంట్ లో వేడుకలు చేశారు. ఎటు చూసిన గనుల వద్ద వందేమాతర గీతాలతో వ వా ర ౖ వె ౨ా గా ం ఎ ఎ. కార్యక్రమంలో అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

జైపూర్, (ఆంధ్రజ్యోతి): ఎస్టీపీపీలో అధికారులు, ఉద్యోగులు వందేమాతరం గేయాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా ఎస్టీపీపీ ఈడీ చిరంజీవి, జీఎం నరసింహారావు మాట్లాడుతూ వందే మాతర గేయాన్ని బంకించంద్రచటర్జీ రాశారని తెలిపారు. భారతదేశ స్వాతంత్ర్య పోరాటంలో వందేమాతర గీతం ఎంతో చారిత్రాత్మక పాత్ర పోషించిందన్నారు. అనంతరం ఇటీవల మందమర్రి ఏరియాలో సింగరేణి కంపెనీ స్థాయిలో జరిగిన సంస్కృతిక పోటీల్లోవేణుగాన వాయిదం, కర్ణాటక సంగీతంలో ప్రథమ బహుమతి సాధించిన ఎస్టీపీపీ ఉద్యోగులు రవీంద్రకుమా రస్వామి, శ్రీనిధిలను అభినందించారు. కార్యక్రమంలో ఎస్టీపీపీ అధికారులు మదన్ మోహన్, శ్రీనివాస్, పర్వయ్య, పంతుల, ఠాకూర్ మోహన్‌సింగ్ పాల్గొన్నారు.

శ్రీరాంపూర్, (ఆంధ్రజ్యోతి): వందేమాతరం గేయం ఆలాపనతో దేశ ఐక్యత పెరుగుతుందని శ్రీరాంపూర్ ఏరియా జీఎం మునిగంటి శ్రీనివాస్ అన్నారు. వందే మాతరం గేయం రాసి 150 ఏళ్లయిన సందర్భంగా జీఎం కార్యాలయంలో గేయం ఆలపించారు. సింగరేణి సంస్థలో ఏడాది పాటు నిర్వహించే అన్ని కార్యక్రమాలు అన్నింటిలో వందేమాతర గేయం ఆలపించనున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఓ టు జీఎం సత్యనారాయణ, ఏఐటీయూసీ బ్రాం చ్ కార్యదర్శి బాజీసైదా, అధికారుల సంఘం కోశాధికారి పద్మజ, డీజీఎంలు అనిల్ కుమార్, రాజ న్న, హరినారాయణ గుప్తా, విజయ్ కుమార్, ఏరి యా సర్వే అధికారి నర్సింగరావు పాల్గొన్నారు.

రెబ్బెన, (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి ఏరియాలోని గనులు, డిపార్టుమెంట్లలో అధికారులు, ఉద్యోగులు వందేమాతరం గీతాన్ని ఆలపించారు. గోలేటి జీఎం కార్యాలయం ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో జీఎం విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు అన్వేష్, నాయకులు ఉజ్వల్‌కుమార్ బెహెరా, ఎస్‌ఓటు జీఎం రాజమల్లు, పర్సనల్ హెచ్‌ఓడి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


శ్రీరాంపూర్‌లో గేయం ఆలపిస్తున్న జీఎం, అధికారులు


రెబ్బెనలో పాల్గొన్న జీఎం, సింగరేణి అధికారులు



ఆధునిక టెక్నాలజీతో సంస్థ ఆస్తుల రక్షణ

శ్రీరాంపూర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఆధునిక టెక్నాలజీతో సింగరేణి సంస్థ ఆస్తులను రక్షిస్తున్నట్లు శ్రీరాంపూర్ ఏరియా జీఎం మునిగంటి శ్రీనివాస్ అన్నారు. సెక్యూరిటీ విభాగంలో 15 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన సెక్యూరిటీ కార్యాలయం, సెక్యూరిటీ అధికారి కార్యాలయం, మేల్ గార్డుల విశ్రాంతి గది, ఫిమేల్ గార్డుల విశ్రాంతి గదులను జీఎం ప్రారంభించి మాట్లాడారు. సెక్యూరిటీ విభాగం సిబ్బంది తమ పనులను పారదర్శకతతో నిర్వర్తిస్తూ ప్రతిభ చూపుతున్నారన్నారు. ఉద్యోగుల శ్రేయస్సు దృష్ట్యా వారికి మెరుగైన వసతులు కల్పిస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా కార్యాలయాలను ఆధునీకరించినట్లు వివరించారు. కార్యక్రమంలో ఎస్‌ఓ టు జీఎం సత్యనారాయణ, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా, అధికారుల సంఘం కోశాధికారి పద్మజ, ఏజీఎం (ఫైనాన్స్) బీభత్స, డీజీఎంలు రాజన్న, హరినారాయణ గుప్తా, మల్లయ్య, సెక్యూరిటీ అధికారి జక్కారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మహిళల భద్రతకు ప్రాధాన్యం

శ్రీరాంపూర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో మహిళల భద్రతకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని శ్రీరాంపూర్ ఏరియా జీఎం మునిగంటి శ్రీనివాస్ అన్నారు. సింగరేణిలో పనిచేసే మహిళా ఉద్యోగులకు జీఎం కార్యాలయంలో షీ టీంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ, మహిళా ఉద్యోగులకు ఎలాంటి ఇబ్బంది కలిగినా ఫిర్యాదు చేయవచ్చన్నారు. పనిస్థలాల్లో మహిళలను ఎవరైనా ఇబ్బందులకు గురిచేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం షీ టీం ఎస్‌ఐ షైమ, శ్రీరాంపూర్ ఎస్‌ఐ సంతోష్ మాట్లాడుతూ మహిళల భద్రత కోసమే షీ టీం ఏర్పాటైందన్నారు. మహిళలను ఆకతాయిలు భయాందోళనకు గురిచేసినా, వేధించినా, ఇబ్బందికరంగా మాట్లాడినా డయల్ 100, షీ టీం నెంబర్ 6303923700 ద్వారా తమకు ఫిర్యాదు చేయవచ్చన్నారు. సమావేశంలో ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా, అధికారుల సంఘం కోశాధికారి పద్మజ, డీజీఎం(పర్సనల్) అనిల్ కుమార్, ఎస్టేట్స్ అధికారి వరలక్ష్మీ, సెక్యూరిటీ అధికారి జక్కారెడ్డి, లా అధికారులు మల్లేష్, ప్రబంధిత, ఐఈడీ అధికారి సంగీత, సీనియర్ పీవో కాంతారావు, ఐటీ ప్రోగ్రామర్ శ్రీనివాస్, షీ టీం సిబ్బంది, సింగరేణి మహిళా ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణానికి వేతనం విరాళం

లక్షెట్టిపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): లక్షెట్టిపేట పట్టణంలో తెలంగాణ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం భవన నిర్మాణం కోసం లక్షెట్టిపేట టీఎన్‌జీవో యూనిట్ అధ్యక్షుడు గోళ్ల శ్రీనివాస్ తన వంతుగా ఒక నేల వేతనాన్ని శుక్రవారం సంఘం జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరికి అందించారు.

ఈసందర్భంగా జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ యూనిట్ కార్యాలయ భవన నిర్మాణం కోసం విరా ళాల సేకరణ కార్యక్రమం మొదలు పెట్టామని అందుకు సంఘ సభ్యులు స్వచ్ఛందంగా విరాళాలను అందిస్తున్నారని అన్నారు. ఈవిరాళాల సేకరణలో జిల్లా అధ్యక్షుడితో పాటు పలువురు వారాళాలను అందజేసారు.

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

కోటపల్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : సర్వాయిపేట గ్రామంలో శుక్రవారం కోటపల్లికి చెందిన పనకంటి కపిల్‌కుమార్ వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. చలి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని నిరుపేదలైన 40 మంది వృద్ధులకు దుప్పట్లు అందించారు. సమాజ సేవలో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. అలాగే గ్రామాల్లో నిర్మితమవుతున్న నూతన హనుమాన్ మందిరానికి ఆర్థిక సహాయం అందించారు.

ఈ కార్యక్రమంలో గ్రామమాజీ సర్పంచు మహేష్, మిత్రబృందం సభ్యులు సుధాకర్, శ్యాంసుందర్, చంద్రయ్య, రామకృష్ణ పాల్గొన్నారు.

చెక్‌బౌన్స్ కేసులో ఏడాది జైలు శిక్ష

బెల్లంపల్లి, నవంబరు7 (ఆంధ్రజ్యోతి): తిర్యాణి మండలం గంబీరావుపేటకు చెందిన శ్రావణ్ అనే వ్యక్తికి చెక్ బౌన్స్ కేసులో ఏడాది జైలు శిక్షతో పాటు రూ.12 లక్షల జరిమాణ మంగళవారం సివిల్‌కోర్టు జడ్జి ముకేష్ విధించినట్లు వన్‌టౌన్ సీఐ శ్రీనివాసరావు తెలిపారు. బెల్లంపల్లి పట్టణం కన్నాల బస్తీకి చెందిన నవీన్‌కు 2023లో శ్రావణ్ రూ.10లక్షల చెక్కు ఇచ్చాడు. చెక్ బౌన్స్ కావడంతో కేసు వేయగా నేరం రుజువై శ్రావణ్‌కు శిక్ష విధించినట్లు సీఐ తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్ల అక్రమాలపై విచారణ చేపట్టాలి



మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

బెల్లంపల్లి, నవంబరు7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో జరుగుతున్న అక్రమాలపై విచారణ చేపట్టాలని టీటీపీ పట్టణ అధ్యక్షుడు మణిరాం సింగ్ అన్నారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్లు అనర్హులకు కేటాయించారన్నారు. అర్హులైన పేదలందరినీ గుర్తించి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో కొందరు నాయకులు లబ్ధిదారుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారన్నారు. ఈ విషయంపై స్థానిక ఎమ్మెల్యేతో పాటు జిల్లా కలెక్టర్ పూర్తి విచారణ చేపట్టి అక్రమాలకు పాల్పడిన వారిని శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు హరిబాబు, రాజన్న, లక్ష్మణ్, ప్రవీణ్‌లు పాల్గొన్నారు.

కట్టెల పొయ్యితో కష్టాలు



ధర్మారావుపేట పాఠశాలలో కట్టెల పొయ్యితో అవస్థలు పడుతున్న మహిళ

ఎల్‌పీజీ సిలిండర్ లేక అవస్థలు

- రోగాల బారిన పడుతున్న మధ్యాహ్న భోజన నిర్వాహకులు
- పట్టించుకోని అధికారులు

కాసిపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లోని మధ్యాహ్న భోజన నిర్వాహకులను కష్టాలు వీడడం లేదు. మధ్యాహ్న భోజన బిల్లుల చెల్లింపులో జరుగుతున్న ఆలస్యం వల్ల నిర్వాహకులు అప్పుల పాలవుతున్నారు. ఇదిలా ఉండగా వంట నిర్వహణ నిర్వహించే మహిళలు కట్టెల పొయ్యితో రోగాల బారిన పడి తీవ్ర అవస్థలు పడుతున్నారు. జిల్లాలో 737 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా కేవలం 135 పాఠశాలలు ఎల్‌పీజీ సిలిండర్లు, గ్యాస్ పొయ్యిలు అందుబాటులోకి వచ్చాయి. 602 పాఠశాలలకు కట్టెల పొయ్యిపైనే వంటలు చేస్తున్నారు. పాఠశాల ఆవరణలో ఉన్న ఇరుకు గదుల్లో వంట చేయడం వల్ల కట్టెల పొయ్యి నుంచి వెలు వడే పొగ కాలుష్యం తో మధ్యాహ్న భోజనం వండేవారు రోగాల బారిన పడుతున్నారు. కట్టెల పొయ్యిమీద వంట చేయలేమ ని అధికారులకు దరఖాస్తులు పెట్టుకున్నా ఎవరు స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మసకబారుతున్న జీవితాలు...

కట్టెల పొయ్యి పొగ వంట చేసే వారిని నిశ్శబ్దంగా చంపేస్తుంది. కట్టెల పొయ్యి నుంచి విషపూరితమైన పొగ వెలువడుతుంది. దీంతో ఇంటితో పాటు పరిసర ప్రాంతాలను కలుషితం చేస్తుంది. దీని వల్ల ట్యూబర్ కులోసిస్ ఊపిరితిత్తుల వ్యాధి, అస్థమియా, లుకీమియా, హృదయరోగం, కంటి శుక్లాల లాంటి అతి ప్రమాదకరమైన వ్యాధుల బారిన పడతారని వైద్యులు హెచ్చరిస్తున్నారు. మధ్యాహ్న భోజన నిర్వాహకుల్లో ఎక్కువ మంది మహిళలు దమ్ము, దగ్గుతో పాటు కంటి ఊపిరి తిత్తుల సమస్యలతో బాధపడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ప్రతి పాఠశాలకు ఎల్‌పీజీ సిలిండర్లు, గ్యాస్ పొయ్యిలు అందిం చేలా చర్యలు తీసుకోవాలని వంట నిర్వాహకులు కోరుతున్నారు.

వంట చెరుకుతో అదనపు భారం

ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం నిర్వహణకు వంట చెరుకు అదనపు భారంగా మారింది. వంట చెరుకును అడవి నుంచి తీసుకురాకూడదని అటవీ శాఖ అధికారులు హుకుం జారీ చేశారు. దీంతో వంట చెరుకును తెచ్చేందుకు ఎవరు కూడా ముందుకు రావడం లేదు. దీంతో వర్షాకాలంలో వంట చెరుకు దొరకక వండేవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తడిచిన కట్టెలతో వంట చేయలేక సమ యానికి భోజనం అందించక ఇబ్బందులు పడుతున్నారు. దీన్ని అదునుగా భావించి వంట చెరుకు తీసుకు వచ్చే కూలీలు అదనంగా వసూలు చేస్తున్నారు. దీంతో నెలకు రూ. 2 వేలు అదనంగా నష్టపోతున్నామని వంట చేసే మహిళలు వాపోతున్నారు.

మహిళలకు అందని మహాలక్ష్మి పథకం...

ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మీ పథకం మధ్యాహ్న భోజనం నిర్వాహకులకు వర్తించడం లేదు. మధ్యాహ్న భోజన నిర్వహణను స్థానిక మహిళ సంఘాలు (ఎస్‌హెచ్‌జీ) కొనసాగిస్తున్నాయి. కానీ ప్రభుత్వం ఇటీవల మహాలక్ష్మీ పథకం ద్వారా గ్యాస్ సిలిండర్లపై రాయితీ ప్రకటించింది. ప్రభుత్వ పాఠ శాలల్లో వంట చేసే మహిళలకు ఎల్‌పీజీ సిలిండర్‌పై రాయితీ వర్తించడం లేదు. దీని వల్ల ఎల్‌పీజీలకు పూర్తి స్థాయిలో చెల్లించడంతో అదనపు భారంగా మారింది. దీంతో కొన్ని పాఠశాలల్లో గ్యాస్ పొయ్యిలు అటకెక్కాయి. ఎల్‌పీజీ సిలిండర్‌పై మధ్యాహ్న భోజన నిర్వాహకులకు రాయితీ ఇవ్వాలని మహిళా సంఘాలు కోరుతున్నాయి.

కంటి సమస్యతో బాధపడుతున్నా

బండి తార, ధర్మారావుపేట, మధ్యాహ్న భోజన నిర్వాహకురాలు



వంట చేసేటప్పుడు కట్టెల పొయ్యి నుంచి వచ్చే పొగతో కంటి చూపు మందగించింది. ఇంకో మహిళ ఊపిరితిత్తుల వ్యాధి బారిన పడి ఆసుపత్రి పాలైంది. కట్టెల పొయ్యిపై వంట చేయడం కష్టంగా ఉంది. ఎల్‌పీజీ సిలిండర్లు ఇవ్వాలని మా పాఠశాలకు వచ్చిన అధికారులందరికీ వినతి పత్రాలు ఇచ్చాము. అయినా ఎవరు పట్టించుకోవడం లేదు. వంట సకాలంలో కావాలని ఆరాట పడుతున్నా కట్టెలు సరిగ్గా మండక ఇబ్బందులు పడుతున్నాం. వర్షాకాలంలో అయితే మరిన్ని ఇబ్బందులు పడాల్సి వస్తుంది.

ఎల్‌పీజీ సిలిండర్లు మంజూరు చేస్తాం

యాదయ్య, డీఈవో, మంచిర్యాల



ప్రభుత్వ పాఠశాలల్లోని మధ్యాహ్న భోజనం నిర్వా హకులకు ఎల్‌పీజీ సిలిండర్లు అందించే విధంగా చర్యలు తీసుకుంటున్నాం. దీనిపై నివేదికలను సైతం ప్రభుత్వానికి అందజేశాము. కానీ గ్యాస్ ఏజెన్సీలు నిర్వాహకుల నుంచి సిలిండర్ల కోసం డిపాజిట్ చేయాలని తెలిపారు. ఇందుకు నిర్వాహకులు డిపాజిట్ చేసేందుకు ఆసక్తి చూపక పోవడంతో ఎల్‌పీజీల పంపిణీ ఆలస్యం అవుతుంది. ప్రభుత్వ పాఠశాలలకు సిలిండర్లు, గ్యాస్ పొయ్యిలు అందించేందుకు చర్యలు చేపడుతున్నాం.

ఎల్‌పీజీ సిలిండర్ డిపాజిట్ కోసం రుణాలు ఇస్తాం

: కిషన్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి



మధ్యాహ్న భోజనం నిర్వాహకులకు ఎల్‌పీజీ సిలిండర్ల నిర్వహణ కోసం మండల సమాఖ్య నుంచి రుణాలు అందజేస్తాం. ఇందుకు జిల్లా సమాఖ్య ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించి సర్క్యులర్ జారీ చేస్తాం. దీని కి క్షేత్రస్థాయిలో ఐకేపీ సిబ్బందితో సమీక్ష సమావేశాలు నిర్వహించి వెంటనే కార్యచరణ చేపట్టేందుకు చర్యలు తీసుకుంటాం.

ప్రతి ఒక్కరూ అక్షర జ్ఞానం కలిగి ఉండాలి



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అధికారులు

కాసిపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ప్రతి ఒక్కరు అక్షర జ్ఞానం కలిగి ఉండాలని జిల్లా వయోజన విద్య అధికారి అజ్మీర పురుషోత్తంనాయక్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన ఉల్లాస్ శిక్షణ తరగతులకు ఆయన హాజరై మాట్లాడారు. చదువుతో సంస్కారం, జ్ఞానం పెరుగుతుందని, దీంతో మోసాలకు గురి కారన్నారు. ప్రతి ఒక్కరు చదువుకోవాలన్నారు. మహిళలు అక్షరాస్యులుగా ఎదిగితే కుటుంబాన్ని సమర్థవంతంగా నిర్వహిస్తూ పిల్లలను విద్యావంతులుగా తీర్చిదిద్దుతారన్నారు. అనంతరం అమ్మకు అక్షర మాల పుస్తకాన్ని ఆవిష్కరించారు. శిక్షణ తరగతులను సమర్థవంతంగా నిర్వహించిన సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్వాలిటీ కో ఆర్డినేటర్ సత్యనారాయణమూర్తి, డీపీఎం స్వర్ణలత, ఎంఈవో వెంకటేశ్వర స్వామి, డీఆర్‌పీలు బండ శాంకరి, కొండు జనార్దన్, ఏపీఎం రాజ్‌కుమార్, సెర్ప్ సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

చిన్న అరిడెపల్లి అడవుల్లో పెద్దపులి సంచారం

కాసిపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : బెల్లంపల్లి అటవీ రేంజ్ పరిధిలోని చిన్న అరిడెపల్లి అటవీ శివారు ప్రాంతంలో పెద్దపులి సంచరిస్తున్నట్లు అటవీ శాఖ అధికారులు తెలిపారు. బెల్లంపల్లి, దేవాపూర్, తిర్యాణిమూడు అటవీ రేంజ్ పరిధిలో పెద్దపులి సంచరిస్తుందని దాని ఆన వాళ్లను గుర్తించినట్లు అధికారులు పేర్కొన్నారు. అటవీ శివారు ప్రాంతాల ప్రజలు, వ్యవసాయం చేసుకునే రైతులు ఒంటరిగా వెళ్లవద్దన్నారు. అందరు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. గురువారం వెంకటాపూర్ బీట్‌లో ఆవుల మందపై పెద్దపులి దాడి చేసిందనే వదంతులు నమ్మవద్దని తెలిపారు. గ్రామస్థులకు ఎవరికైనా పులి ఆనవాళ్లు కనిపిస్తే వెంటనే తమకు సమాచారం అందించాలని సూచించారు. పులికి హాని చేసే పనులు చేయవద్దని ఈ సందర్భంగా గ్రామస్థులకు సూచించారు.

రైతులకు అవగాహన

కాసిపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : పత్తి పంటను ఆశించే చీడ పీడల నివారణపై కోమటిచేనులో రైతులకు శుక్రవారం మండల వ్యవసాయాధికారి ప్రభాకర్ అవగాహన కల్పించారు.

ఆయన మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలకు చీడపీడలు వేధిస్తాయని, రసం పీల్చే పురుగుల నుంచి కాపాడుకుంటే పత్తి దిగుబడి వస్తుందన్నారు. వ్యవసాయాధికారుల సలహాలు సూచనలు పాటించాలన్నారు. ఏఈవో శ్రీధర్, రైతులు పాల్గొన్నారు.

సమీక్షా సమావేశం

వేమనపల్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : వేమనపల్లి ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందితో ఎంపీడీవో కుమారస్వామి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉపాధి కూలీలందరికి ఈ కేవైసీ పూర్తి చేయాలని, నర్సరీల్లో బ్యాగ్ ఫిల్లింగ్ పూర్తి చేసి పేమెంట్ చేయాలన్నారు. ఉపాధి హామీలో కొత్తపనులను ఎంపిక చేయాలని, పనుల జాతర పనులను ప్రారంభించాలన్నారు. అలాగే పన్నుల వసూళ్లను వంద శాతం పూర్తిచేయాలని, పారిశుధ్య పనులను ప్రతి రోజు చేపట్టాలన్నారు.

ఈ సమావేశంలో ఏపీవో మహేశ్వర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిసిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నస్పూర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : నస్పూర్ విద్యుత్ ఉప కేంద్రంలో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ రాంచందర్ ఒక ప్రకటనలో తెలిపారు. నస్పూర్, తీగల్ పహాడ్, సీతారాంపల్లి, హౌసింగ్ బోర్డు కాలనీ, ఆర్ అండ్ ఆర్ కాలనీ, అభినవ కాలనీ, పటేల్ కాలనీ, ప్రగతి నగర్, రిటైర్మెంట్ కాలనీ, రాజీవ్ నగర్, ఏరియాలో విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు. విద్యుత్ వినియోగ దారులు సహకరించగలరని కోరారు.

●మంచిర్యాల పట్టణం ఏసీసీ, రాంనగర్ సబ్ స్టేషన్ పరిధిలో సబ్ స్టేషన్ మరమ్మతుల కారణంగా విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏడీఈ వేణుగోపాల్ తెలిపారు. శనివారం ఉదయం 9 నుంచి 11 వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలన్నారు

కోటపల్లి: మండలానికి విద్యుత్ సరఫరా చేసే 33 కేవీ లైన్ మరమ్మతుల కారణంగా శనివారం మండలంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ వెంకటేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. కోటపల్లి, దేవులవాడ సబ్‌స్టేషన్‌ల పరిధిలోని అన్ని గ్రామాలకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

తాండూర్ :తాండూర్ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ జాన్ ఒక ప్రకటనలో తెలిపారు. తాండూర్, బోయపల్లి, చౌటపల్లి, ఐబీ, రాజీవ్‌నగర్, కొత్తపల్లి, రేపల్లెవాడ, మాదారం, మాదారం 3 ఇంక్లైన్, కాసిపేట, చంద్రవెల్లి, ద్వారకాపూర్, అబ్బాపూర్, బెజ్జాల, నర్సాపూర్ గ్రామాల్లో విద్యుత్ ఉండదని తెలిపారు.

కాసిపేట : కొండాపూర్ సబ్‌స్టేషన్‌లోమరమ్మత్తుల కారణంగా సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏఈ స్వర్ణలత ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలందరు సహకరించాలని కోరారు.

దండేపల్లి : దండేపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని నెల్కివెంకటాపూర్, మదాపూర్, మ్యాదరిపేట, ద్వారక, ధర్మరావుపేట, పెద్దపేట, లక్ష్మీకాంతాపూర్, నర్సాపూర్ గ్రామాలోని శనివారం విద్యుత్ సరఫరా అంతారయం ఉంటుందని ట్రాన్స్ కో అధికారి బాపు తెలిపారు.

హాజీపూర్ : ర్యాలీ గడ్‌పూర్ 33 కేవీ విద్యుత్ ఉపకేంద్రాల్లో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. హాజీపూర్, టీకన్‌పల్లి, దొనబండ, పెద్దంపేట్, బుద్దిపల్లి, కొండపూర్, కర్ణమామిడి, పడ్తనపల్లి, కొండపల్లి, రాంపూర్, ధర్మారం, గడూ్ంర్, నాగారం, ర్యాలీ, చిన్న గోపాల్పూర్, బాట్ నగర్, పెద్ద గోపాల్పూర్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులకు ఉదయం9.30 నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని తెలిపారు. సహకరించాలని కోరారు.

ఆశ్రమ పాఠశాలలో వైద్య శిబిరం



విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

కోటపల్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించి విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారు. ఇందులో భాగంగా ముగ్గురు జ్వర పీడితులకు రక్త పరీక్షలతో పాటు 33 మంది విద్యార్థులకు మందులు పంపిణీ చేశారు. వ్యక్తిగత శుభ్రతపై అవగాహన కల్పించారు. వైద్యాధికారిణి నిహారిక, సబ్ యూనిట్ అధికారి శ్రీనివాస్, ఎన్‌సీడీ కో ఆర్డినేటర్ లక్ష్మణ్‌స్వామి, హెచ్‌ఎం మధునయ్య, పీహెచ్‌ఎన్ అంజలేనామేరీ, సూపర్ వైజర్లు ఇందిరాగాంధీ, విజయనిర్మల, హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్‌ఎం తిరుపతమ్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

'యువత రాజకీయాల్లోకి రావాలి'..

లక్షెట్టిపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాజకీయాల్లోకి యువత స్వచ్ఛందంగా రావాలని ప్రజారాజ్యం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జిలుకర రవి కుమార్ అన్నారు. శుక్రవారం లక్షెట్టిపేట ప్రెస్‌క్లబ్‌లో పీఆర్‌పీ (ప్రజారాజ్యం పార్టీ) నాయకులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ దేశ రాజకీయ ముఖచిత్రం మార్చాలంటే యువతతోనే సాధ్యం అవుతుందన్నారు. ఇప్పుడున్న అధికార కాంగ్రెస్ పార్టీ పూర్తిగా విఫలం అయ్యిందని అదే విధంగా గతంలో ఉన్న బీఆర్‌ఎస్ పార్టీ పదేళ్ల పాలనలో ఆపార్టీ అధినేత కేసీఆర్ అభివృద్ధిని విస్మరించి అవినీతి అక్రమాలను పెంచి పోశించాడని, ఇక బీజేపి మతాలను రెచ్చకొడుతోందన్నారు. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి కూనపు రెడ్డి హరిప్ర సాద్‌తోపాటు విజయరెడ్డి, ఉదయ్‌సింగ్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

జన్నారం, నవంబరు7 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ భాష సంస్కృతిక శాఖ, అంబేద్కర్ తెలంగాణ సచివాలయం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించిన ప్రభుత్వ ఉద్యోగుల రాష్ట్ర నృత్య పోటీల్లో జన్నారం మండలంలోని కలమడగు గ్రామానికి చెందిన ఏఈవో దివ్య కూచిపూడి నృత్య ప్రదర్శన నిర్వహించి పలువురిని ఆకట్టుకుంది. దీంతో రాష్ట్ర ఉన్నతాధికారులతో ప్రశంస పత్రం పొందినట్లు తెలిపారు.

కరిగిపోతున్న జాలా గుట్ట...

(5వ పేజీ తరువాయి)

క్వారీల నిర్వాహకులు రియల్ ఎస్టేట్ వెంచర్లు, భవన నిర్మాణాలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. అలా నిత్యం రూ. 50 వేల నుంచి లక్ష వరకు అక్రమంగా సంపాదిస్తున్న క్వారీల నిర్వా హకులు ప్రభుత్వ ఖజానాకు మాత్రం తూట్లు పొడుస్తున్నారు. క్వారీల్లో అధిక తవ్వకాల కారణంగా భవిష్యత్తులో పర్యావరణానికి తీవ్ర విఘాతం కలిగే ప్రమాదం ఉందని పలువురు పర్యావరణ ప్రేమికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇష్టారీతిన కొండలు, గుట్టలు తరలిపోతుండటంతో పెద్ద మొత్తంలో ముప్పు వాటిల్లుతుందని హెచ్చరిస్తున్నారు. ఇదిలా ఉండగా అర్ధరాత్రులు జేసీబీలతో తవ్వకాలు జరుపు తుండటంతో విపరీతమైన శబ్దం కారణంగా ఇబ్బందులు పడవలసి వస్తుందని అండాళమ్మ కాలనీ వాసులు వాపోతున్నారు. దాదాపు నెల రోజుల నుంచి గుట్టను అక్రమంగా తవ్వుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నీటి ట్యాంకు వరకు తవ్వకాలు...

మంచిర్యాల నగర ప్రజలకు రక్షిత మంచినీరు అం దించేందుకు జాలా గుట్టపై మిషన్ భగీరథ పథకంలో భాగంగా ఓవర్ హెడ్ ట్యాంకును నిర్మించారు. అందు లో నీటిని నింపి వివిధ ప్రాంతాల్లో ఉన్న రిజర్వాయర్లకు పైపు లైన్ల ద్వారా సరఫరా చేస్తున్నారు. జాలా గుట్టలో జరుగుతున్న అక్రమ తవ్వకాలు ప్రస్తుతం ఓవర్ హెడ్ ట్యాంకు సమీపంలోకి వెళ్లాయి. గుట్టలో తవ్వకాల కారణంగా నీటి ట్యాంక్‌కు ప్రమాదం పొంచి ఉందనే అభిప్రాయాలను కాలనీ వాసులు వ్యక్తం చేస్తున్నారు. తవ్వకాలు మరింత ముందుకు వెళితే ట్యాంకు కూలిపోయే ప్రమాదం కూడా ఉంది. ఇప్పటికైనా మైనింగ్, రెవెన్యూ శాఖల అధికారులు స్పందించి జాలా గుట్టలో అక్రమంగా జరుగుతున్న తవ్వకాలను అడ్డుకోవడంతోపాటు బాధ్యులపై చట్టపర మైన చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

చేపల వేటకు వెళ్లి యువకుడి మృతి

ఇబ్రహీంపట్నం, నవంబరు7 (ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం మండలం మూలరాంపూర్ గ్రామశివారులో చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో పడి వల్లికొండ సిద్దార్థ(18) అనే యువకుడు మృతిచెందాడు. మామడ మండలం పోస్కుల్ గ్రామానికి చెందిన సిద్దార్థ ఈనెల 6న చేపలు పట్టడానికి మూలరాంపూర్ గ్రామశివారులోని సదర్‌మట్ ప్రాజెక్టు గేట్ నెంబర్ 52 వద్దకు వెళ్లాడు. అక్కడ సిద్దార్థ చేపలు పడుతుండగా ప్రమాదవశాత్తు ముందుకు పడి తలకు గాయమై నీటిలో పడి చనిపోయాడు. మృతుడు తండ్రి గంగన్న ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఇబ్రహీంపట్నం ఎస్ఐ తెలిపారు.

సామూహిక వందేమాతర గీతాలాపన

మందమర్రిటౌన్, నవంబరు7 (ఆంధ్రజ్యోతి): వందేమాతర గీతం చరిత్ర చాలా గొప్పదని ఈ గీతం 150 ఏళ్లు పూర్తి చేసుకోవడం దేశ ప్రజలందరూ గీతాలపనలో పాల్గొనడం గొప్ప విషయమని ఏరియా రక్షణ అధికారి భూశంకరయ్య తెలిపారు. శుక్రవారం వందే మాతర గీతం 150 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గీతాన్ని రచించిన రచయిత బంకించంద్ర చటర్జీ స్ఫూర్తి అని తెలిపారు. అనంతరం జాతీయ జెండాకు సెల్యూట్ చేస్తూ గీతాన్ని ఆలపించారు. ఈ కార్యక్రమంలో పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, ఏరియా ఇంజనీర్ డీజీఎం ఈఅండ్ఎం బాలాజీ భగవతి, ఐఈడీ ఎస్ఈ కిరణ్ కుమార్, ఐటీడీపై మేనేజర్ రవి, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ శంకర్, పాల్గొన్నారు.

●పట్టణంలోని ఆయా ప్రభుత్వ, ప్రైవేటు కార్యాల యాలతో పాటు పాఠశాలల్లో వందేమాతరం గీతాలపన వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక కార్మెల్ పాఠశాలలో విద్యార్థులు జాతీయ జెండా పట్టుకొని 150 నంబరును ప్రదర్శించారు.

కోటపల్లి : మండల కేంద్రంలోని ప్రధాన కూడళ్ల వద్ద వివిధ పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు, వివిధ శాఖల అధికారులు సా మూహిక గీతాలాపన చేశారు. తహసీల్దార్ రాఘవేందర్ రావు, ఎస్ఐ రాజేందర్, ఎంపీడీవో నాగేశ్వర్‌రెడ్డి, ఎంపీవో అక్తర్, ఏపీవో వెంకటేశ్వర్, ఏపీఎం ఉమారాణి, స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ కృష్ణ మూర్తి, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు శంకర్, పాల్గొన్నారు.

చెన్నూరు : చెన్నూరులోని ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం వందేమాతర గీతాన్ని ఆలపించారు. ఎంపీడీవో మోహన్, ఎంపీవో అజ్మత్ ఆలీ పాల్గొన్నారు.

జైపూర్ : మండల కేంద్రంలోని ఎంపీడీవో, గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో శుక్రవారం అధికారులు వందేమాతర గీతాన్ని సామూహికంగా ఆలపించారు. ఎంపీడీవో సత్యనారాయణ, ఎంపీవో బాపురావు, ఏపీవో బాలయ్య, ఏవో భాగ్యలక్ష్మీ, సీనియర్ అసిస్టెంట్ మధులత పాల్గొన్నారు.

భీమిని: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో వందేమాతర గీతాలాపన నిర్వహించారు. ఎంపీడీవో గంగామోహన్ ఏపీఎం బ్రహ్మయ్యపాల్గొన్నారు.

కాసిపేట : మండల కేంద్రంలో సామూహిక గీతాలాపన చేశారు. ఎంపీడీవో సత్యనారాయణసింగ్, ఎంపీవో సప్దర్ ఆలీ, సిబ్బంది పాల్గొన్నారు.



కార్మెల్ పాఠశాలలో 150 నంబర్‌లో విద్యార్థుల ప్రదర్శన





మంచిర్యాల రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో...కోటపల్లిలో సామూహిక వందేమాతర గీతాలాపన



జైపూర్ పంచాయతీ కార్యాలయంలో...

షీ టీం సేవలపై అవగాహన

ఆసిఫాబాద్‌రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బూర్గుడ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఏహెచ్‌టీయూ, షీ టీం సేవలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా షీ టీం ఇన్‌చార్జి ఎస్సై బిక్కులాల్ మాట్లాడుతూ విద్యార్థినులు, మహిళలు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొన్నా, వేధింపులు, చీటింగ్, సైబర్ మోసాలు, ఈవ్ టీజింగ్ వంటి ఘటనలు ఎదురైతే వెంటనే డయల్ 100 లేదా షీటీం హెల్ప్‌లైన్ నంబరు .8712670564ను సంప్రదించాలన్నారు. చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై నర్సయ్య, కానిస్టేబుళ్లు రజిని, స్వప్న, వర లక్ష్మి, దినేష్, కాలేజీ ప్రిన్సిపాల్ శారద తదితరులు పాల్గొన్నారు.

చోర్‌పల్లిలో గ్రామసభ

ఆసిఫాబాద్‌రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ మండలం చోర్‌పల్లిలో శుక్రవారం గ్రామసభ నిర్వహించి 2026-27 సంవత్సరానికి గాను ఈజీఎస్‌లో చేపట్టే పనులపై చర్చించారు. కార్యక్రమంలో కార్యదర్శి తిరుపతి, టీఏలు మల్లుబాయి, రవీందర్‌రాథోడ్, ఎఫ్ఏ అంకులు, నాయకులు నారాయణ, ఆశన్న తదితరులు పాల్గొన్నారు.

సైబర్‌నేరాలపై అవగాహన

సిర్పూర్(యు), నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పంగడిలో ఎస్పీ కాంతిలాల్ పాటిల్ ఆదేశాలతో శుక్రవారం ప్రజలకు కళాబృందం ద్వారా సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహిచారు. ఈ సందర్భంగా ఎస్సై రామకృష్ణ మాట్లాడుతూ సేబర్‌నేరాలపై అప్రమత్తంగా ఉండలన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది రామచందర్, రోహిత్, శ్రీనివాస్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఎస్పీఎం ట్రేడ్ యూనియన్ ఎన్నికలకు

అడ్డంకులు

- హైకోర్టును ఆశ్రయించిన యాజమాన్యం
- మండిపడుతున్న కార్మికసంఘాలు
- ఈ నెల 17న విచారణ



సిర్పూర్ పేపర్ మిల్లు

కాగజ్‌నగర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): సిర్పూరు పేపర్ మిల్లు(ఎస్పీఎం)లో ట్రేడ్ యూనియన్ ఎన్నికల ప్రక్రియకు అడ్డంకులు ఏర్పడ్డాయి. యాజమాన్యం హైకోర్టును ఆశ్రయించడంతో ఎన్నికలు నిలిచి పోయే పరిస్థితి నెలకొంది. యూనియన్ల అర్హతపై అభ్యంతరాలు తెలుపుతూ మేనేజ్‌మెంటు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. గత నెల 28న ఆదిలాబాద్ డిప్యూటీ లేబర్ కమిషనర్ రాజేశ్వరి వద్ద ట్రేడ్‌యూనియన్ ఎన్నికల నిర్వహించేందుకు రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించింది. ఈ సమావేశంలో ఎస్పీఎం ట్రేడ్ యూనియన్ నాయకులు హాజరయ్యారు.

ఈ సమావేశానికి ఎస్పీఎం యాజమాన్యం మాత్రం హాజరు కాలేదు. డిసెంబరులో ట్రేడ్ యూనియన్ ఎన్నికలు నిర్వహిస్తామని రౌండ్‌టేబుల్ సమావేశంలో స్పష్టంగా తేల్చింది. మిల్లులో ఎంత మంది కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు వారి జాబితా నవంబరు 3లోగా తమకు అందజేయాలని నోటీసును కూడా పంపించింది. కాని యాజమాన్య మాత్రం ట్రేడ్ యనియన్ల అర్హతపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ హైకోర్టును ఆశ్రయించడంతో ఇప్పుడు అనిశ్చితి ఏర్పడింది. బిర్లా యాజమాన్యం నుంచి జేకే సంస్థకు మార్పిడి జరిగిన తర్వాత కార్మికులపై పని ఒత్తిడి, స్థానికులకు అవకాశం లేకుండా చేసినట్టు, స్థానికేతరులను విధుల్లోకి తీసుకొని అధిక జీతాలిస్తూ పనులు చేయిస్తున్నట్టు ట్రేడ్ యూనియన్ నాయకులు బాహాటంగా యాజమాన్యం తీరుపై మండి పడుతున్నారు. నిబంధనలకు విరుద్దంగా వేతనం ఒప్పందం చేసినట్టు, ప్రొడక్షన్ బోనస్‌లో కోత విధించినట్టు, సెలవులు 30 నుంచి 26 కుదించచిం నిర్ణయాలు తేల్చాలని డీసీఎల్‌కు పలువురు ఫిర్యాదు కూడా చేశారు. మిల్లు పునరుద్ధరణ జరిగిన తర్వాత కార్మికులపై పని భారం చేయటం, పెరిగిన ధరలకు అనుగుణంగా వేతన సవరణ కాక పోవడంతో అపార నష్టం జరుగుతున్నట్టు కార్మికులు చెబుతున్నారు.

కార్మికుల డిమాండ్..

యాజమాన్యం తీసుకుంటున్న నిర్ణయాలతో ట్రేడ్ యూనియన్ ఎన్నికల నిర్వహణ అనివార్యమని కార్మికుల్లో ఇప్పుడు డిమాండ్ పెరిగింది. మిల్లులో ట్రేడ్ యూనియన్ ఎన్నికలు జరిగితే ప్రతి అంశం యాజమాన్యంతో తేల్చుకునే అవకాశాలున్నాయి. యాజమాన్యం వ్యూహాత్మకంగా హైకోర్టును ఆశ్రయించటంతో ఎన్నికల ప్రక్రియ నిలిచిపోయే అవకాశం ఉంది. ఈ నెల 17న జరిగే విచారణలో ట్రేడ్ యూనియన్ ఎన్నికల భవితవ్యం తేలనుంది. హైకోర్టులో కూడా సీఐటీయూ సంఘం రిట్‌పిటిషన్ వేసింది.

అలాగే సిర్పూరు పేపర్ మిల్ ట్రేడ్ యూనియన్ నంబరు 966 ప్రతినిధులు ట్రేడ్ యూనియన్ నాయకులు కూడా ఎస్పీఎంలో ఎన్నికలు నిర్వహించాల్సిందేనని హైకోర్టులో కూడా రిట్ పిటిషన్ వేశారు. యాజమాన్యం తప్పుడు నిర్ణయాలు తీసుకుంటుందని వెంటనే ఎన్నికలు నిర్వహించేట్టు చూడాలని ఈ పిటిషన్‌లో దాఖలు చేశారు. మిల్లులో కార్మికులకు ఉద్యోగ భద్రత లేకుండా ఉంటుందని, అలాగే తరుచూ ప్రమాదాలు జరిగినప్పటికీ పరిహారం ఎం త ఇస్తారన్న విషయం ఇంత వరకు అధికారికంగా యాజమాన్యం ప్రకటించటం లేదు. ప్రమాదాలు జరిగితే కనీసం యాక్సిడెంట్ రిపోర్టు కూడా ఇవ్వటం లేదని కార్మికులు పేర్కొంటున్నారు.

2022 అగ్రిమెంటు ఒప్పందం నిబంధనలకు విరుద్దంగా జరిగినట్టు, లేబర్ అధికారుల సంతకం లేనే లేదని ట్రేడ్‌యూనియన్ నాయకులు యాజమాన్యం తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మిల్లులో క్యాంటిన్ సౌకర్యం లేక పోవడం, సెలవుల కుదింపు, ప్రొడక్షన్ బోనస్‌పై పది శాతం చేయటం అంశాల్లో యాజమాన్యం తీసుకుంటున్న నిర్ణయాలతోనే ట్రేడ్ యూనియన్ ఎన్నికల కోసం దారి వేసినట్టు, ఎన్నికలు జరిగితే తమకు న్యాయం జరుగుతుందని కార్మికులు అంతా డిమాండ్ చేస్తున్నారు. ఎన్నికల జరిగితే భవిష్యత్తు వివిధ నిర్ణయాలు తీసుకునే అవకాశలుండవన్న ఉద్దేశ్యంతో యాజమాన్యం హైకోర్టులో కేసు వేసి ఎన్నికల ప్రక్రియ బ్రేక్ వేసేలా చేశారని పలువురు చెబుతున్నారు. ఈ నెల 17న జరిగితే విచారణలో పూర్తి అంశాలు తేలనున్నాయి.

గవర్నర్ చేతుల మీదుగా బంగారు పతకం


తండ్రితో బంగారు పతకం అందుకున్న ప్రియదర్శిణి

లింగాపూర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ శాతవాహన యూనివర్శిటీలో శుక్రవారం ఏర్పాటు చేసిన యూనివర్శిటీ ద్వితీయ స్నాతకోత్సవంలో రాష్ట్ర గవర్నర్, చాన్సలర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా లింగాపూర్ మండలం కన్నెపల్లి గ్రామానికి చెందిన కనక ప్రియదర్శణి బంగారు పతకం అందుకోవడంతో పలువురు అభినందించారు. కనక ప్రియదర్శణి బీఏ సంస్కృతం విభాగంలో మొదటి స్థానంలో నిలిచిందని గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

ఉపాధ్యాయుల డ్యూటీలు తనిఖీ చేయొద్దు



మాట్లాడుతున్న టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు శాంతికుమారి

సిర్పూర్(టి), నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు డ్యూటీలు తనిఖీ చేయవద్దని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు శాంతికుమారి అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహిం చిన టీఎస్‌యూటీఎఫ్ మహాసభలో ఆమె మాట్లాడారు. పాఠశాలల పర్యవేక్షణ కోసం ఇప్పటికే మండలానికి ఒక ఎంఈవో, కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్, ఎంఎన్‌వోలు ఉన్నారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఇతర జిల్లాల అధికారులు కూడా ఉన్నారని తెలిపారు. కానీ మళ్లీ పర్యవేక్షణ నిమిత్తమైన ఉపాధ్యాయులను ప్రైమరీ స్కూల్స్, హైస్కూల్స్, అప్పర్ ప్రైమరీ స్కూల్స్ లెవల్ లోపల తనిఖీ చేయడానికి కొన్ని టీంలు వేయడం కోసం ఉత్తర్వులు జారీ చేయడం సరైన విధానం కాదన్నారు. దీని ద్వారా ఉపాధ్యాయులు బడికి దూరమై విద్యార్థులకు సరైన బోధన అందదని తెలిపారు. సమా వేశంలో ఆ సంఘం నాయకులు హరీష్, హరీష్‌కుమార్, తరుణ్, సబి నా, రమణ, రాము, సందీప్, ప్రమోద్, సెలెస్టినా, ఐశ్వర్య, సాయి ప్రవీ ణ్, జహీర్, సాబీనా, సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పరిశీలన

పెంచికలపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్కపల్లి, ఎల్లూరు, పెంచికలపేట గ్రామ పంచాయతీల పరిధిలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను ఎంపీడీవో ఆల్బర్ట్ శుక్రవారం పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు చంద్రశేఖర్, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్లు ఆవిష్కరణ

సిర్పూర్(యు), నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎస్టీ జాబిత నుంచి లంబాడాలను తొలగించాలని ఆదివాసీలు చేపడుతున్న ఆదివాసీల ధర్మ యుద్ధం చలో ఉట్నూర్ పోస్టర్లు శుక్రవారం మండల కేంద్రంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తుడుం దెబ్బ మండల అధ్యక్షుడు కుమ్ర భీంరావు మాట్లాడుతూ ఎస్టీ జాబిత నుంచి లంబాడాలను తొలగించే వరకు ఆదివాసీల ఆందోళనలు కొనసాగుతాయన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు ఆత్రం ఓంప్రకాష్,కుమ్ర సోము పాల్గొన్నారు.

కోల్ ఇండియా పోటీల్లో రాణించాలి

రెబ్బెన, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కోల్ ఇండియా పోటీల్లో ఆటగాళ్లు రాణించాలని ఏరియా సెక్యూరిటీ అధికారి శ్రీధర్ అన్నారు. డబ్ల్యూపీఎస్ అండ్ జీఏ 92వ వార్షిక క్రీడా పోటీల్లో భాగంగా శుక్రవారం గోలేటి శ్రీ భీమన్న స్టేడయంలో డిపార్టుమెంట్ ఫుట్‌బాల్ పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకుడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్‌లో ఎమ్మెల్యే ప్రచారం


ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్‌రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ లోని జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి జరుగనున్న ఉప ఎన్నికల్లో ప్రచారంలో భాగంగా ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి పాల్గొని అభ్యర్థి మాగంటి సునీతకి మద్దతుగా ప్రచారం చేశారు. నియోజకవర్గంలోని రెహమాత్‌నగర్‌లోని కారిమకనగర్ నుంచి ఓంనగర్ వరకు విస్తృత ప్రచారం చేపట్టారు. గడపగడపకు వెళ్లి బీఆర్ఎస్ అభ్యర్థికి ఓటు వేయాలని కోరారు.

ప్రతి ఒక్కరూ చదువు నేర్చుకోవాలి

వాంకిడి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఉల్లాస్ కార్యక్రమం ద్వారా సంఘ సభ్యులు ప్రతి ఒక్కరూ చదువు నేర్చుకోవాలని సీఆర్పీలు కవిత, భారతి అన్నారు. స్థానిక ఐకేపీ కార్యాలయంలో శుక్రవారం వేంకటేశ్వర మండల సమాఖ్య సమాఖ్య ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మండల సమాఖ్య సభ్యులు తార, యశోద, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు చేపట్టాలి

కెరమెరి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్య పనులను గ్రామాల్లో పకడ్బందీగా చేపట్టాలని ఎంపీడీవో సురేష్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఆయన మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వాహించారు. సమావేశంలో ఎంపీవో అంజద్‌పాషా, కార్యదర్శులు, ఉపాధి హామి సిబ్బంది పాల్గొన్నారు.

ఏకో బ్రిడ్జి పరిశీలన

వాంకిడి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోయగాం- మహారాష్ట్ర సరిహద్దులో నిర్మించిన ఏకో బ్రిడ్జిని శుక్రవారం అటవీ ఉన్నతాధికారులు ఎఫ్‌డీపీటీ శాంతారం, కవ్వాల్ రిజర్వు ఫారెస్టు ఎఫ్‌డీవో నీరజ్‌కుమార్, ఎన్‌హెచ్ఏఐ అధికారులతో కలిసి పరిశీలించారు. తెలంగాణ- మహారాష్ట్ర సరిహద్దుల్లో నిర్మిస్తున్న ఏకో బ్రిడ్జి పనులను సకాలంలో పూర్తి చే యాలని ఈ సందర్భంగా వారు సూచించారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్వో గోవింద్ చంద్ సర్దార్, ఎఫ్ఎస్‌వో సతీష్‌కుమార్, ఎఫ్‌బీఓలు షాహీద్, ఉమారాణి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో మాక్ పోలింగ్

కౌటాల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి):మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు మాక్ పోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా నామినే షన్, ఓటు వేసే విధానం, ఓట్ల లెక్కింపు, విజేతల ప్రకటన తదితర అంశా లను విద్యార్థులతో చేయించారు. మాక్ పోలింగ్‌ను తహసీల్దార్ ప్రమోద్ కుమార్, ఎంఈవో హనుమంతు, హెచ్ఎం నానాజీ పరిశీలించారు. ఉపాధ్యాయులు రమేశ్, సుశీలదేవిని అభినందించారు.

వందేమాతరం గీతం దేశభక్తికి నిదర్శనం

- కలెక్టర్ వెంకటేష్ దోత్రే
- జిల్లా వ్యాప్తంగా వందేమాతరం గీతాలాపన
- పాల్గొన్న అధికారులు, యువజన సంఘాల నాయకులు


ఆసిఫాబాద్‌లో వందేమాతర గీతం ఆలపిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే


ఆసిఫాబాద్‌లో వందేమాతర గీతం ఆలపిస్తున్న ఎస్పీ కాంతిలాల్ పాటిల్

ఆసిఫాబాద్‌రూరల్/బెజ్జూరు/పెంచికలపేట/దహెగాం/సిర్పూర్(టి)/వాంకిడి/జైనూర్/కెరమెరి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): వందేమాతర గీతం దేశభక్తికి నిదర్శనమని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో కోట్ల మంది భారతీ యుల్లో స్ఫూర్తి నింపిన వందేమాత రం గీతానికి శుక్రవారంతో 150 ఏళ్లు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా ఏడాది పొడవున కార్యక్ర మాలు నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయిం చింది. ఇందులో భాగంగా కుమరం భీం జిల్లాలో ఈ కార్యక్ర మాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో వందే మాతరం సామూహిక గీతాలాపన కార్యక్రమానికి ఆసిఫాబాద్ ఆర్డీవో లోకేశ్వర్‌రావు, అధికారులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు, యువజన సంఘాల ప్రతనిధులతో కలిసి హాజరై సుజలాం..సుఫలాం అంటూ గీతాలాపన చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడు తూ వందే మాతరం గీతం రచించి 150 సంవత్సరా లు పూర్తి కావడంతో సంతోషంగా ఉందని, స్వాతంత్ర్య ఉద్యమకాలంలో పోరాటానికి స్ఫూర్తినిచ్చిందని తెలిపారు. దేశ ఐక్యతకు ఈ గీతం నిదర్శనమని అన్నారు. వందేమాతరం గీతాన్ని ఆలపించడం ద్వారా దేశభక్తిని చాటుదా మని తెలిపారు. ఈ కార్య క్రమంలో జిల్లా అధికా రులు, సిబ్బంది, యువజన సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్ ఆధ్వర్యంలో గీతాన్ని ఆలపించారు. కార్యక్రమంలో ఆర్ఐ పెద్దన్న, అంజన్న, డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్, రవీందర్, సిబ్బంది పాల్గొన్నారు. బెజ్జూరు మండల కేంద్రంలోని మహాత్మ జ్యోతిబాపూలే విద్యాలయంతో పాటు అన్ని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో వందే మాతరం గీతాన్ని ఆలపించారు. వందే మాతరం గీతంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పెంచికలపేట ఎంపీడీవో కార్యాలయం, పోలీసు స్టేషన్‌తో పాటు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో వందేమాతరం గీతాన్ని ఆలపించారు. దహెగాం మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, గ్రామ పంచాయతీల్లో వం దేమాతరం గీతాన్ని ఆలపించారు. సిర్పూర్(టి) మండలంలో ఎంపీడీవో, తహసీ ల్దార్, పోలీసు స్టేషన్‌తో పాటు అన్ని గ్రామ పంచాయతీల్లో వందేమాతర గీతాన్ని ఆలపించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సత్యనారాయణ, తహసీల్దార్ రహీముద్దీన్, ఎస్సై సురేష్‌తో పాటు గ్రామ పంచాయతీ కార్యదర్శులు, అధికారులు పాల్గొన్నారు. వాంకిడి మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేటు ప్రభుత్వ పాఠశాలల్లో వందేమాతర గీతాన్ని ఆలపించారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొ న్నారు. జైనూర్ తహసీల్దార్ కార్యా లయంతో పాటు వివిధ కార్యాల యాల్లో ఉద్యోగులు వందేమాతరం గీతాలాపన ఘనంగా నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో తహసీల్దార్ ఆడ బీర్షావ్, ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి, ఆర్ఐ మోహన్, సూపరింటెండెంట్ శ్రీనివాస్, ఎంపీవో మోహన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. కెరమెరి మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కార్యాలయాల్లో వందేమాతరం గీతాన్ని ఆలపించారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.


బెజ్జూరులో 150 అంకెల ఆకృతిలో విద్యార్థులు


సిర్పూర్(టి)లో వందేమాతరం గీతం ఆలపిస్తున్న అధికారులు


వాంకిడిలో వందేమాతరం గీతం ఆలపిస్తున్న విద్యార్థులు

క్రీడలపై దృష్టి సారించాలి

ఆసిఫాబాద్‌రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై దృష్టి సారించాలని గిరిజన సంక్షేమ శాఖ జిల్లా క్రీడాధికారి షేకు జన్కాపూర్‌లోని సెయింట్ మేరీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం వార్షిక క్రీడా దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గిరిజన సంక్షేమ శాఖ జిల్లా క్రీడాధికారి షేకు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లిబిన్, కరస్పాండెంట్ లిల్లీపౌల్, పీఈటీలు కిరణ్, బహదూర్షా, ఉపాధ్యాయురాలు అర్చన తదితరులు పాల్గొన్నారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

ఆసిఫాబాద్‌రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఆసిఫాబాద్ డివిజన్‌లో సిబ్బందికి అందిస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి ఆడెపు భాస్కర్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని ఆసిఫాబాద్ రైతు వేదికలో మహిళా శిశు సంక్షేమ శాఖ, యూనిసెఫ్ సంయుక్త ఆధ్వర్యంలో ఆసిఫాబాద్ డివిజన్‌లోని ఐసీడీఎస్, వైద్య సిబ్బందికి ఏర్పాటు చేసిన ఎస్ఎస్ఎఫ్‌పీ రీ-ఓరియంటేషన్ శిక్షణ తరగతులకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి సీతారాం, యూనిసెఫ్ బృందం జిల్లా కన్సల్టెంట్ బాలాజీతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిశు, మాత, పోషణ, ఐవైసీఎఫ్ మార్గదర్శకాలు, పోషకాహార లోపం నివారణ చర్యలు, పిల్లల పోషకాభివృద్ధి అంశాలపై సమగ్ర అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. తల్లి పాల ప్రాముఖ్యత, వయస్సుకు అనుగుణమైన ఆహారం, సూక్ష్మ పోషకాలు, పిల్లల వృద్ధి పర్యవేక్షణపై నిపుణుల ద్వారా వివరించాలమని తెలిపారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను క్షేత్రస్థాయిలో అమలు చేసి ఫలితాలు సాధించాలని తెలిపారు. కార్యక్రమంలో సాంకేతిక సహాయకులు ప్రవీణ్, నరేష్, తదితరులు పాల్గొన్నారు.


శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

ముగిసిన సప్తాహం

బెజ్జూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): బెజ్జూరు మండలంలోని బారెగూడ గ్రామంలోని అభయాంజనేయ ఆలయంలో వారం రోజుల నుంచి కొనసాగుతున్న సప్తహం శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా గ్రామస్థులు వారం రోజుల పాటు ఆలయంలో భజన కార్యక్రమాలు, ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. చివరి రోజు దేవతమూర్తుల చిత్రపటంతో గ్రామంలో శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్ర మం నిర్వహించారు.